ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 20 అక్టోబరు 2024

సొమ్ముల నిరీక్షణకు చెక్..!

- ఎలక్షన్ డబ్బు వచ్చిందోచ్..!!
- జిల్లాలకు రూ.20 కోట్లు విడుదల
- ఇక ఆ సొమ్ములు ఇచ్చేస్తారా?
- టీఏ, డీఏలకు ఉద్యోగుల ఎదురుచూపు

మదనపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ఏజెన్సీల నిరీక్షణకు తెరపడనుంది. తమకు రావాల్సిన బిల్లుల కోసం ఏజెన్సీలు, టీఏ, డీఏల కోసం ఎన్నికల సిబ్బంది, అధికారులు అయిదు నెలలుగా వేచిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ ఖర్చుల బకాయిలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో అటు ఏజన్సీలు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నట్లయింది. ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలకు సుమారు రూ.300 కోట్లు విడుదల చేస్తూ జీవో నంబర్-1772 విడుదల చేసింది. ఇందులో అన్నమయ్య జిల్లాకు సంబంధించి రూ.19.77 కోట్లు ఉంది. కత్తి మీద సాము లాంటి ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించడంలో జిల్లా అధికారుల నుంచి సిబ్బంది వరకూ విజయం సాధించారు. వ్యయ, ప్రయాసాలతో కూడుకున్న ఈ క్రతువులో వివిధ విభాగాలకు చెందిన వెయ్యి మంది వరకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మార్కెట్‌లోని ధరలు, అద్దెలకు అనుగుణంగా ఒక్కో నియోజకవర్గానికి రూ.2.50 కోట్ల నుంచి రూ.3.50 కోట్లు కేటాయిస్తోంది. ఈ నిధులను కూడా విడతల వారీగా విడుదల చేస్తుంటుంది. ఈ క్రమంలో 2024 సాధారణ ఎన్నికల ప్రక్రియలో ఇప్పటికే నాలుగు విడతలుగా ఒక్కో నియోజకవర్గానికి రూ.1.30 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకూ విడుదల చేయగా, తాజాగా చివరి దశలో మొత్తం బకాయిలు విడుదల చేసినట్లు ఆ శాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో ఒక్కో నియోజకవర్గానికి రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్లు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో సాధారణ ఎన్నికల ప్రక్రియకు ఒక్కో కేంద్రానికి మండలాలు, పోలింగ్ కేంద్రాలను బట్టి రూ.2.50 కోట్ల నుంచి రూ.3.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు పెద్ద కసరత్తే చేసి అప్పుల చిట్టా ప్రభుత్వానికి పంపారు. ఇందుకోసం పెండింగ్ బిల్లులకు సంబంధించి ఏజెన్సీలు, నిర్వాహకులు, ఆయా శాఖాధిపతుల నుంచి మరోసారి బిల్లులు తీసుకుని బడ్జెట్ ప్రపోజల్స్ పంపించారు. ఇప్పటివరకు విడతల వారీగా వచ్చిన సొమ్ములో ఏజన్సీ నిర్వాహకులు, ఎన్నికల సిబ్బందికి రూ.3 వేల నుంచి రూ.5 వేలు, అధికారులకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు చెల్లించారు. అది కూడా కొందరికి మాత్రమే. మిగిలిన వారంతా టీఏ, డీఈల కింద చెల్లిస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. పోలింగ్ ప్రక్రియ ముగిసినా పూర్తి స్థాయిలో డబ్బులు అందకపోవడంపై పోలింగ్ విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపాలిటీ కార్యాలయాలకు క్యూ కట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఇస్తామని సర్దిచెప్పి పంపించారు. అలాగే ఎన్నికల విధులకు వాహనాలు సమకూర్చిన వాహనదారులు, వాహనాలకు పెట్రోల్, డీజిల్ పట్టిన పెట్రోల్ బంకులు యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా అప్పటి ఆయా ఆర్డీవో కార్యాలయాలతో పాటు జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఆడిట్ ఉండదు. అందుకే పెద్దమొత్తంలో తినేయడం, స్వాహా చేయడం చేస్తుంటారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది చేత పనులు చేయించడం, త్రుణమో.. పణమో ఇచ్చి వారి వాహనాలను వినియోగించుకుని, వాటిని అద్దెకు తీసుకున్నట్లు నాలుగింతలు బిల్లు పెట్టినట్లు చెబుతున్నారు. ఏజన్సీల నుంచి కొటేషన్లు తీసుకొచ్చి క్లయిమ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక మదనపల్లెలోనే కాదు. అన్ని కేంద్రాలలోనూ అదే పరిస్థితి. ఈ లెక్కలకు ఆడిట్, జవాబుదారీతనం లేకపోవడం, బిల్లు పెట్టినంతా ఇస్తారని గ్యారెంటీ లేకపోవడం, నిజంగా ఖర్చు చేసినంతే బిల్లు పెట్టినా వెంటనే వస్తుందనే నమ్మకం లేకపోవడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఒకటికి నాలుగింతలు పెడుతుంటారు. ఇదీ స్థూలంగా ఎన్నికల ప్రక్రియ సొమ్ములో జరిగే చేతివాటం. వీఆర్ఏ, వీఆర్వో, ఆఫీసు సిబ్బంది, సెక్టోరియల్ ఆఫీసర్, ఎంసీసీ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్, పీవో, ఏపీవో, కౌంటింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు విధుల్లో పాల్గొన్నారు. ఇందులో పోలింగ్ రోజున, కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్న వారికి సొమ్ములు ఇచ్చేయగా, మిగిలిన భోజన ఏజన్సీలు, వాహన యజమానులు, పెట్రోల్‌బంకుల



యజమానులు, సప్లయర్స్, ఎలక్ట్రిసిటీ, తదితర నిర్వాహకులు సొమ్ములు ఇవ్వాల్సి ఉంది. ఇందులోనూ ఇప్పటికే అన్ని రకాల ఏజన్సీల నిర్వాహకులకు సగానికిపైగా ఇవ్వగా, మరో రూ.50 లక్షల లోపే బకాయి ఉన్నట్లు చెబుతున్నారు.

ఇప్పుడొచ్చిన నిధుల్లో ఎక్కువ మొత్తం ఉద్యోగులకు టీఏ, డీఏ ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల్లో ఖర్చు చేసిన దాని కంటే రెట్టింపులో బడ్జెట్ ప్రపోజల్స్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ఏడు పద్దుల కింద ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేయగా, జిల్లా స్థాయిలో కలెక్టర్ నియోజకర్గాల వారీగా కేటాయింపులు చేయనున్నారు. ఇందులో కలెక్టర్ కార్యాలయం ఖర్చులు పోనూ, మిగిలిన మొత్తాన్ని నియోజకవర్గానికి రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే, నిధులు ఆలస్యంగా రావడంతో చాలా మంది ఉద్యోగులు..వీటిపై ఆశలు వదిలేశారు. ఈ పరిస్థితిలో చివరి విడతగా వచ్చిన సొమ్ములను వారికి ఇస్తారో లేక స్వాహా చేస్తారో అనే అనుమానాలు కూడా లేక పోలేదు. ఎందుకంటే ఎన్నికల విధుల్లో పాల్గొన్న తహసీల్దార్లు, ఏఆర్‌వోలు తిరిగి బదిలీపై సొంత ప్రాంతాలకు వెళ్లడంతో పంపిణీ ఎలా ఉంటుందోనని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



సామాన్యుడి నుంచి సౌత్ కొరియా వరకు..



లాబ్‌లో పరిశోధనలు జరుపుతున్న రాజేశ్‌కుమార్

- దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన..
- మొట్టమొదటి విదేశీ సైంటిస్ట్ రాజేశ్‌కుమార్
- యువ సైంటిస్టులకు ఆదర్శంగా నిలిచిన వైనం
- ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు

Sunday Special

సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాల లో చదువుకుని.. ఎస్వీ యూనివర్శిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసి భారతదేశం గర్వపడే స్థాయిలో దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన మొట్టమొదటి విదేశీయుడు రాజేశ్‌కుమార్. బద్వేలు కు చెందిన ఈయన బాల్యమంతా కష్టాలమయమే. తండ్రి బాడుగ జీపు నడుపుతూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టు కొచ్చేవారు. అప్పట్లోనే చదువు విలువ తెలిసిన రాజేశ్‌కుమార్ ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాన్ని పొంది, కుటుంబానికి అండగా నిలబడాలనుకున్నారు. ఆ మేరకు ఆర్థిక స్థోమత లేకున్నా.. రాజేశ్‌కుమార్ పట్టు విడవలేదు. డిగ్రీ వరకు బద్వేలు, అనంతరం తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసి సైంటిస్ట్ స్థాయికి చేరుకున్నారు. దేశ విదేశాల్లో ప్రఖ్యాత జనరల్స్ లో ఈయన పరిశోధనా పత్రాలు ప్రచురితం అయ్యాయి. దాదాపు 70 పరిశోధనలకు పేటెంట్ పొందారు. త్వరలో ఇండియాకు తిరిగొచ్చి ఫ్లోరైడ్ నీటిపై పరిశోధనలు చేసి దేశం రుణం తీర్చుకుంటానని అంటున్న రాజేశ్‌కుమార్‌పై ప్రత్యేక కథనం..

- వివరాలు 6లో..

ముఖ్యమైన ఫైళ్లను రికవరీ చేస్తాం

- సబ్ కలెక్టరేట్‌లో దహనమైన భవనాల శుభ్రం షురూ
- త్వరలో ఆర్‌వోఆర్ కోర్టు ప్రారంభం
- సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో దహనమైన భవనాలు స్వాధీనం చేసుకున్నామని, ముఖ్యమైన ఫైళ్లను రికవరీ చేస్తున్నామని, ఈ భవనంలోని కాలిపోయిన వస్తువులు, బూడిద శుభ్రం చేసే కార్యక్రమాలు ప్రారంభించామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన సెక్షన్‌లు, డీఏవో చాంబర్‌ల వద్ద శుభ్రం చేసే పనులను రెవెన్యూ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ గదుల్లో కాలిపోకుండా బీరువాల్లో మిగిలిన ఫైళ్లను రెవెన్యూ సిబ్బంది భద్రపరుస్తున్నారు. ఈ విషయమై సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రెండున్నర నెలలుగా కొన్ని ఫైళ్లు కాలిపోయిన భవనంలోనే ఉండిపోయాయని, దీనివలన పిటీషనర్ల సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో కాలిపోయిన గదుల్లోని బీరువాల్లో ఉన్న మిగిలిన ఫైళ్లను భద్రపరుస్తున్నామన్నారు. దీంతో పాటు ప్రభుత్వ ఫైళ్లు కూడా రికవరీ మొదలు పెట్టామన్నారు. ఈ గదులన్నీ శుభ్రం చేయడంతో పాటు, కోర్టు హాల్లో ఆర్‌వోఆర్ కోర్టును త్వరలో ప్రారంభిస్తామని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. కాగా డివిజన్‌లోని అన్ని మండలాల నుంచి రోజుకు నలుగురు వీఆర్‌ఏల ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్‌లోని కాలిపోయిన గదుల్లో శుభ్రం చేయడంతో పాటు మిగిలిన ఫైళ్లను భద్రపరుస్తున్నారు.



సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన గదుల్లో బీరువాల్లో మిగిలిన ఫైళ్లను తీస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాయ మాటలకు.. మాతృత్వం కానుక

- యువతిని నమ్మించి తల్లిని చేసిన యువకుడు



గుర్రంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉన్న తన కుటుంబాన్ని చదువనే ఆయుధంతో జయించి ఉన్నత స్థాయికి చేర్చాలనే సంకల్పంతో ఉపాధ్యాయ వృత్తి విద్యా కోర్సులో చేరింది. ఈ కోర్సులో బాగా రాణిస్తూ మరికొన్ని నెలల్లో విద్యను పూర్తి చేయనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థిని చదువుతున్న ప్రాంతంలో ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారి ఆ యువకుడు చెప్పిన మాయమాటలను నమ్మి నిలువునా మోసపోయింది.

తనను ఎప్పటికైనా పెళ్లి చేసుకుంటాడనే ఆశతో తన కడుపులో ఇద్దరి ప్రతిరూపాన్ని పెంచుతూ వచ్చింది. నెలలు నిండడంతో ఆ యువతి శనివారం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. గుర్రంకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (19) రాయచోటి పట్టణంలోని డైట్ కాలేజీలో ఉపాధ్యాయ వృత్తి విద్యా కోర్సు చదువుతోంది. ఈ యువతికి అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారడంతో కోర్సు పూర్తి కాగానే వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించాడు. ఈ మాయ మాటలను యువతి నమ్మి ప్రియుడిపై నమ్మకంతో తన గర్భంలో ప్రతి రూపాన్ని పెంచుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో నెలలు నిండడంతో ఈ యువతికి ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు శనివారం ఉదయం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ ఆ యువతి ఆడ శిశువుకు జీవం పోసింది. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ విషయంపై యువతి కానీ, తల్లిదండ్రులు కానీ ఎవరిపైనా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

చెయ్యేరుకు జలకళ

- వరద నీటితో ప్రవహిస్తున్న నది



రాజంపేట మండలం గుండ్లూరు వద్ద వరద నీటితో కళకళలాడుతున్న చెయ్యేరు నది

రాజంపేట, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెయ్యేరు నది వరదనీటితో కళకళలాడుతోంది. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో రాజంపేట మండలంలోని చెయ్యేరు నదికి వరదనీరు చేరింది. శుక్రవారం బాలరాజుపల్లె కాజ్‌వేకు చేరిన నీరు శుక్రవారం రాత్రి భారీవర్షాలు ఎగువ ప్రాంతాల్లో కురవడంతో వరదనీరు చెయ్యేరుకు చేరింది. చెయ్యేరునది పరీవాహక ప్రాంతాలైన సుమారు 50 గ్రామాల పైబడి ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు పుష్కలంగా లభించనుంది. ఎగువ ప్రాంతంలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండే అవకాశం లేనందున వర్షపు నీరంతా దిగువ ప్రాంతాలకు చేరుతోంది. 20 ఏళ్లకు మునుపు అన్నమయ్య ప్రాజెక్టు లేకపోవడంతో నిత్యం నీటితో ఈ చెయ్యేరు కళకళలాడేది. తద్వారా రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లోని చెయ్యేరునది పరీవాహక ప్రాంతాల్లో ఊటకాలువల ద్వారా సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టు భూమి పండేది. ప్రతి ఇంటిలో ఫిల్టర్ పాయింట్ల ద్వారా 4 అడుగుల నుంచి పుష్కలంగా నీరు లభించేది. అదేవిధంగా అతి తక్కువ ఖర్చుతో బోరు బావులు వేసుకుని వేలాది ఎకరాలకు సాగునీరు అందించేవారు. ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు కట్టడం వల్ల ప్రాజెక్టు నిండితే తప్ప దిగువ ప్రాంతాలకు నీరందేది కాదు. దీని వల్ల దిగువ ప్రాంతాలన్నీ ఎడారిగా మారిపోయాయి. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల దిగువ ప్రాంతాల చెయ్యేరునది పరీవాహక ప్రాంత ప్రజలకు తిరిగి పూర్వ వైభవం సంతరించుకుంది. అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు రైతుల్లో మాత్రం నిరాశ నెలకొంది. కారణం ప్రాజెక్టు లేకపోవడంతో దిగువ ప్రాంతాల్లోని పుల్లంపేట, రాజంపేట మిట్ట ప్రాంత రైతులకు నీరందే అవకాశం లేనందున ఆ ప్రాంత రైతులు నిరాశ చెందుతున్నారు.

వర్షం దెబ్బకు టమో'రా'



మదనపల్లె మండలంలో వరుస వర్షాలతో టమోటా తోటలో రాలి పోలిన టమోటాలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పడమటి మండలాల్లో అన్‌సీజన్ టమోటా పంట సాగుకు వరుస వర్షాలు శాపంగా మారాయి. ఐదు రోజులుగా ఎక్కువగా టమోటా సాగయ్యే 17 మండలాల్లో విడవకుండా జల్లులు కురవడం, గాలిలో తేమశాతం పెరగడంతో టమోటా తోటలకు ఫంగస్ బెడద పట్టుకుంది. ఈ ఫంగస్ దెబ్బకు టమోటా తోటలకు పలు రకాల తెగుళ్లు సోకి, రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అంతేకాకుండా భూమిలో నీటిశాతం పెరిగి టమోటా కాయల్లో నీళ్ల దిగి మొక్కల నుంచి రాలిపోతున్నాయి.

టమోటా తోటలకు తెగుళ్ల బెడద

సాధారణంగా టమోటా పంట సాగయ్యేందుకు 25 నుంచి 30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వాతావరణం ఉండాలి. ఈ వాతావరణంలో టమోటా తోటలకు తెగుళ్ల ఎక్కువగా ఆశించవు. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటే ఫంగస్, బ్యాక్టీరియా ఉధృతంగా వ్యాపిస్తూ టమోటా పంటలను దెబ్బతీస్తాయి. ప్రస్తుతం జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజవర్గాలతో పాటు రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండ్యం, సంబేపల్లె మండలాల్లో టమోటా పంట 10 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగవుతోంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గాలిలో తేమశాతం గణనీయంగా పెరిగిపోయింది. ఉష్ణోగ్రత కూడా 20 నుంచి 23 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఈ వాతావరణంలో టమోటా తోటల్లో మొక్కలకు ఫంగస్ విజృంభిస్తోంది. దీనివలన బూడిద తెగులు, ఆకు మచ్చ తెగులు, టమోటా కాయలకు మచ్చలు పడటం మొదలైంది. అంతే కాకుండా టమోటా మొక్కల ఆకులు పసుపురంగులోకి మారిపోవడం వల్ల మొక్క ఎదిగే ఆస్కారం తక్కువనే చెప్పవచ్చు. దీని ద్వారా కాయల ఉత్పత్తి తగ్గిపోతూ, దిగుబడి తగ్గిపోతోంది. ఈ తెగుళ్ల నుంచి టమోటా తోటలను రక్షించుకునేందుకు రైతులు స్ప్రే మందులు పిచికారీ చేస్తున్నా గంటకు ఒకసారి కురిసే జడివానతో స్ప్రే మందులు కూడా వర్షం నీటిలో కలిసిపోయి వృథా అవుతున్నాయి. ఇదిలా ఉండగా తెగుళ్ల వ్యాప్తికి మూడు రోజుల గడువు ఉంటే చాలు పక్క, పక్కన తోటలకు వేగంగా విస్తరిస్తోంది. దీనివలన పశ్చిమాన టమోటా పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. టమోటా తోటల్లో వర్షపు నీరు ఎక్కువగా నిలిచినా ప్రమాదమే. ముఖ్యంగా భూమిలో నీటి శాతం పెరగడం వల్ల మొక్కలకు వేలాడే టమోటా కాయలకు కుళ్లు రోగం వస్తోంది. అంతేకాకుండా కాయల్లో నీరు చేరి బరువు ఎక్కువై నేల రాలిపోతున్నాయి. కొన్నిచోట్ల అయితే టమోటా కాయలు పక్వానికి రాకముందే పచ్చిగానే నేల రాలిపోతున్నాయి.

రూ.80 కోట్లు నష్టపోనున్న రైతులు

జిల్లాలో వరుస వర్షాల కారణంగా పడమటి మండలాల్లో టమోటా పంట దెబ్బతింటోంది. జిల్లాలోని 17 మండలాల్లో ఎక్కువగా రైతులు టమోటా పంట సాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో ఎంత లేదన్నా 10 నుంచి 12 వేల ఎకరాల్లో టమోటా పంట సాగవుతోంది. ఈ క్రమంలో టమోటా తోటలకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. పలుచోట్ల ఆకుముడత తెగులు, బూడిద తెగులు, కుళ్లరోగం కనిపిస్తోంది. ఈ వర్షాలు ఇలాగే మరో ఐదు రోజులు కురిస్తే జిల్లాలో ఎంత లేదన్నా 4 వేల ఎకరాల్లో టమోటా తోట తుడిచిపెట్టుకుపోయే అవకాశం ఉంది. ఎకరా టమోటా పంట సాగుకు రైతులు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఇలా టమోటా దిగుబడి చేతికి వచ్చే సమయంలో తెగుళ్ల సోకితే సుమారు రూ.80 కోట్ల వరకు టమోటా రైతులు నష్టపోయే అవకాశం ఉంది.

తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలు

వాతావరణంలో తేమ శాతం ఎక్కువ ఉంటే టమోటా తోటలకు బూడిద తెగులు వస్తుంది. ఈ తెగులు ఎక్కువ ఉధృతిలో ఉంటే పిలిన్ మందును ఒక లీటరు నీటిలో 1.2 ఎంఎల్ కలిపి మొక్కలకు పిచికారీ చేయాలి. బూడిద తెగులు ఉధృతి తక్కువగా ఉంటే ఒక లీటరు నీటిలో ఇండెక్స్ మందును 2 గ్రాములు కలిపి ఈ మిశ్రమాన్ని మొక్కలకు పిచికారీ చేయాలి. నల్లమచ్చల తెగులు నివారణకు ఒక లీటరు నీటిలో అమిస్టర్ టాప్ ఒక గ్రాము, లేదా మెరివోన్ 0.4 గ్రాములు, లేదా కావోచ్ ఫ్లో 2 మిల్లీలీటర్లు కలిపి ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. కాయలపై నల్లమచ్చలు ఎక్కువగా ఉంటే ఒక లీటరు నీటిలో ప్లాంటోమైసిన్ మందును 0.5 గ్రాములు కలిపి ఈ మిశ్రమాన్ని టమోటా కాయలపై పిచికారీ చేయాల్సి ఉంది. అలాగే తెల్లదోమ, పచ్చదోమ నివారణకు ఒక లీటరు నీటిలో 1.2 మిల్లీలీటర్ల సిమోడీస్ కలిపి మొక్కలకు పిచికారీ చేయాలి. వర్షం పూర్తిగా తగ్గిపోయాక ఎకరా టమోటా పొలంలో 5 కిలోల మెగ్నీషియమ్ సల్ఫేట్‌తో పాటు 19-19-19 ఎరువును 5 కిలోలు, ఆగ్రోవిన్ మాక్స్‌ను 2 కేజీలు డ్రిప్ పైపుల గుండా నీటితో కలిసిపోయేలా చేసి మొక్కలకు పారకట్టాలి.

ఫుట్‌బాల్ @ సిద్దమ్మగారిపల్లె



2022లో ఆరోగ్యవరంలో విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన సిద్దమ్మగారిపల్లె క్రీడాకారులు


సిద్దమ్మగారిపల్లె


ప్లాట్లుగా ఫుట్‌బాల్ క్రీడా మైదానం


జాతీయ క్రీడాకారులు నరేశ్, రిఖిల్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని పోతబోలులో చిన్నఊరు సిద్దంగారిపల్లె. మదనపల్లె పట్టణానికి కూతవేటు దూరంలో ఆ గ్రామం ఉంది. ఆ గ్రామస్తులకు మూడు తరాల నుంచి ఫుట్‌బాల్ క్రీడ వారసత్వంగా వస్తోంది. ఫుట్‌బాల్‌లో స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ప్రస్తుతం 50 మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులున్న చిన్న పల్లె అది.

ఫుట్‌బాల్ క్రీడకు స్ఫూర్తి డాక్టర్ జెషోడియన్

మదనపల్లెకు 5 కిలోమీటర్ల దూరంలో క్షయవాధి నివారణ కేంద్రాన్ని 1910లో స్థాపించారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌గా పేరు ఉన్నప్పటికీ శానిటోరియంగా ప్రసిద్ధికెక్కింది. ఇందులో సూపరింటెండెంట్‌గా డాక్టర్ జెషోడియన్ వచ్చారు. అనంతరం అతను ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడంతో మొదటగా సిద్దంగారిపల్లెకు చెందిన కాలవపల్లె గంగయ్య కుమారుడు జీకే వెంకటరమణ ఫుట్‌బాల్ ఆడడానికి సుముఖత చూపడంతో డాక్టర్ జెషోడియన్ తర్ఫీదు ఇవ్వడంతో ఆట మొదలైంది. చిన్నతనం నుంచే తండ్రి వద్ద బెంగళూరు నుంచి రబ్బర్‌బాల్ తెప్పించుకుని ఊళ్లో ఆడుకునేవారమని జీకే వెంకటరమణ తెలిపారు. ఆరోగ్యవరంలోని యుఎంటీఎస్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. 1956లోనే ఆరోగ్యవరంలో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏర్పాటు చేసి అక్కడ ఫౌండర్ జెషోడియన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం 1957-58లో ఆరోగ్యవరంలో జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వెంకటరమణ సీనియర్ జట్టుతో వెళ్లి కడప, తిరుపతి ప్రాంతాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. బీటీ కళాశాలలో చదువుతున్న రోజుల్లో లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన యూనివర్సల్ ఇంటర్ కాల్ జట్టు తరఫున ఆడారు.

స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి...

సిద్దంగారిపల్లె క్రీడాకారులు స్కూల్ గేమ్స్ స్థాయి నుంచి జాతీయ ఫుట్‌బాల్ అండర్-14 జట్టుకు ఇద్దరు ఎంపికయ్యారు. గత నెలలో గౌహతిలో జరిగిన పోటీల్లో వీరు పాల్గొని ప్రతిభ చూపారు. సిద్దమ్మగారిపల్లెకు చెందిన కె.చెన్నకేశవులు, సుజాత కుమారుడు కె.నితీష్, ధనుంజయ, రెడ్డినాగేశ్వరి కుమారుడు ఎన్.రిఖిల్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు స్కూల్ గేమ్స్‌తో పాటు ఇంటర్ జిల్లా స్థాయి జట్టులో క్రీడల్లో పాల్గొన్నారు. వైజాగ్, ఏలూరులో జరిగిన పోటీల్లో పాల్గొని అనంతపురం ఏపీ క్యాంపులో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14లో ఎ.సాయి కిరణ్ ఇంటర్ జిల్లా స్థాయిలో విశాఖపట్టణంలో ఆడి రాష్ట్ర స్థాయి క్రీడల్లో కూడా పాల్గొన్నారు. అలాగే డి.నరేష్ ఇంటర్ డిఫెన్స్ కళాశాల తిరుపతిలో చదువుతున్నాడు. ఇతను స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 జిల్లా స్థాయిలో కడప, కర్నూల్, నెల్లూరు, చిత్తూరులో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఇంటర్ జిల్లా స్థాయిలో కర్నూల్‌లో విన్నర్‌గా నిలిచి జాతీయ స్థాయిలో అండమాన్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. వి.కార్తీక్ ఇంటర్ ఎస్వీ డిఫెన్స్ అకాడమీ తిరుపతిలో చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్, జిల్లా స్థాయిలో క్రీడల్లో గెలుపొంది, కర్నూల్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నారు.

ఇంటింటికి ఫుట్‌బాల్ క్రీడాకారులే

సిద్దమ్మగారిపల్లెలో మొత్తం 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి, ఇందులో ఇంటింటికి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు. 50 మందికి పైగా ఈ ఊరిలో ఫుట్‌బాల్ క్రీడాకారులున్నారు. వీరు వారంలో ఒక్కరోజు ప్రాక్టీస్ కోసం హార్సిలీహిల్స్‌కు వెళతారు. వీరు మదనపల్లె మిషన్ కాంపౌండ్, పలమనేరు, చిత్తూరు. చింతామణి, కోలారు ప్రాంతాల్లో ప్రైవేట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంటారు. 2022లో ఆరోగ్యవరంలో జరిగిన టోర్నమెంట్ స్వరాజ్ క్రీడా పోటీల్లో ఎ-జట్టు విన్నర్స్, బి.జట్టు రన్నర్స్‌గా సిద్దమ్మగారిపల్లె క్రీడాకారులే నిలిచారు.

మూడు తరాల నుంచి...

మొదటి తరంలో జీకే వెంకటరమణ ఫుట్‌బాల్ ఆడగా ఆయన కుమారుడు కె.చెన్నకేశవులు (48) జాతీయ స్థాయిలో కేరళలోని ఆలూవాలో, 2000 సంవత్సరంలో బీటీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ కాల్ జట్టులో పుత్తూరులో నిర్వహించిన క్రీడల్లో విన్నర్‌గా నిలిచారు. మూడో తరం చెన్నకేశవులు కుమారుడు కె.నితీష్ ప్రస్తుతం జాతీయ స్థాయిలో అస్సాంలో జరిగిన ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నాడు.

గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలి

సిద్దమ్మగారిపల్లె సమీపంలో గతంలో క్రీడా మైదానం ఉండేది. అక్కడ 6, 7 టీములతో 9 టోర్నమెంట్లు నిర్వహించారు. అది ఇప్పుడు అన్యాక్రాంతమై వైసీపీ పాలనలో వెంచర్ వేసి ప్లాట్స్‌గా మార్చేశారు. ఆరోగ్యవరంలో క్రీడా మైదానం ఉండేది. అక్కడ కూడా జాతీయ రహదారికి క్రీడామైదానం పోవడంతో ప్రాక్టీస్ కోసం ఇబ్బందులు పడుతున్నామని క్రీడాకారులు చెబుతున్నారు. కావున పల్లె వద్ద క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఇదే గ్రామంలో భద్రయ్య ఫిజికల్ డైరెక్టర్‌గా నిమ్మనపల్లెలో పనిచేస్తున్నారు. అలాగే శ్రీవేద స్కూల్‌లో పీఈటీగా మహేష్ పనిచేస్తూ ఇక్కడ యువతకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం గ్రౌండ్‌కు స్థలం కేటాయిస్తే జాతీయ స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి కూడా క్రీడాకారులను తయారు చేస్తామని కోచ్ మహేష్ చెబుతున్నారు.

- గ్రామంలో 50 మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు
- స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి...
- మూడు తరాలుగా ఫుట్‌బాల్ క్రీడ వారసత్వం

చాలామందిని తయారు చేస్తా



సిద్దమ్మగారిపల్లె నుంచే చాలామందిని క్రీడాకారులను తయారు చేస్తాను. ఇప్పటికే కోచ్‌గా వ్యవహరించడంతో యువత చాలా ఉత్సాహంగా ఉన్నారు. క్రీడల ప్రాక్టీస్ కోసం మైదానం లేక ఇబ్బందులు పడుతున్నాం. మైదానానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

-మహేష్, ఫుట్‌బాల్ కోచ్, సిద్దమ్మగారిపల్లె

జెషోడియన్ స్ఫూర్తిగా...



చిన్నతనం నుంచి ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. మా తండ్రి వద్ద రబ్బర్‌బాల్ తెప్పించుకుని ఆడుకునేవాడిని. స్కూల్‌లో చేరిన తరువాత డాక్టర్ జెషోడియన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఫుట్‌బాల్ నేర్చుకున్నా. అప్పటిలో కళాశాల స్థాయిలో ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నా.

- జీకే వెంకటరమణ, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, సిద్దమ్మగారిపల్లె

మూడుసార్లు హాజరు వేయాలి

- కలెక్టర్ ఆదేశాలు



కలికిరి, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ప్రతిరోజూ తప్పనిసరిగా మూడు పర్యాయాలు హాజరు నమోదు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం ఎంపీడీవోలతో జరిగిన టెలీకాన్ఫరెన్సులో ఈ మేరకు అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సచివాలయాల ఉద్యోగుల హాజరు నమోదుకు ఆయా పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని, అదేవిధంగా కార్యదర్శులు కూడా తమ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనివేళల్లో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలలోగా ఒక సారి, మధ్యాహ్నం రెండో దఫా, సాయంత్రం 5 గంటలకు మూడోసారి హాజరు వేయాలని సూచించారు. దీనిని ప్రతిరోజూ ఎంపీడీవోలు సమీక్షించాలని కూడా కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా సెలవుపై వెళ్లదలిచే సచివాలయ ఉద్యోగులు సంబంధిత కార్యదర్శి, ఎంపీడీవోకు సమాచారం అందజేసి ముందస్తు అనుమతి తీసుకోవాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారీ హాజరుపై ఉద్యోగులు నిర్లక్ష్యం పాటిస్తే కఠిన చర్యలకు గురువుతారని కూడా వివరించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవలసింది పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవోలు ఆదేశించారు.

హత్య కేసు మిస్టరీ వీడేనా?

- వివాహేతర సంబంధమే కారణమా...


ఖాదర్‌బాషా (ఫైల్)

కురబలకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట సమీపంలో యువకుడు హత్యగురైన సంఘటన కలకలం రేగింది. శుక్రవారం రాత్రి హత్యకు గురైన యువకుడి హత్య కేసు మిస్టరీ పోలీసులకు ఛాలెంజ్‌గా మరింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోటకు చెందిన వి.బాబ్జి కుమారుడు ఖాదర్‌బాషా (26) గత రెండేళ్ళ క్రితం బతుకుదెరువు నిమిత్తం కువైత్‌కు వెళ్లి తిరిగొచ్చాడు. కాగా గ్రామంలో అతను చింతపండు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిండేవాడని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇటీవల ఆ మహిళ భర్త కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఈ విషయాన్ని అతడికి కొంతమంది స్థానికులు తెలియజేయడంతో హత్యకు పథకం పన్నాడు.

దీంతో కొంతమందికి ఖాదర్‌బాషా హత్యకు డీల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న అతడికి ఫోన్ రావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లగా కొంతమంది అతడిని బలవంతంగా తీసుకెళ్లారని కుటుంబీకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద కిరాతకంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా హత్య జరిగిన సంఘటనా స్థలంలో మద్యం బాటిల్, గ్లాసులు, ఒక మహిళ చెప్పు ఉండటంతో హంతక ముఠాలో మహిళ ఎవరైనా వారికి సహకరించారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని విచారించడంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించారు. కాగా యువకుడి హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలకు గడువు పెంచాలంటూ అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు స్పందించి ముగిసిన గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించాలని తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఈనెల 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. ఈనెల 31వ తేదీ తర్వాత ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు గడువు పెంచడం జరగదన్నారు.

ఓపెన్ స్కూల్స్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశం పొందాలనుకునే వారు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రం ద్వారా గానీ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గానీ సంప్రదించి ప్రవేశం పొందవచ్చునని వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాయచోటి విద్యార్థి


వెంకటసాయి

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దివ్యతేజ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి వెంకటసాయి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న కడప పట్టణంలోని స్పోర్ట్స్ పాఠశాలలో అండర్-17 విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చి కడప జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హిందూపూర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో వెంకటసాయి పాల్గొంటారని ఆయన తెలిపారు.

పసుపు రిబ్బన్లతో విధులకు...


పసుపు రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

వాల్మీకిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని వాల్మీకిపురంలో జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. శనివారం వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో కాలయాపన చేసి ఎన్నికల జీవోల పేరుతో సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్‌లు స్వప్న, కళావతి, లక్ష్మీదేవి, నందిని, ప్రసాద్‌కుమార్, జానీ, పరమేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమణ్య, నరసింహులు, రాజగోపాల్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ ఆలయ హుండీ లెక్కింపు


రెడ్డెమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

గుర్రంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ ఆలయ హుండీని దేవదాయ శాఖాధికారులు శనివారం లెక్కించారు. అమ్మవారి హుండీని ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారి హుండీ ద్వారా రూ.7,00,175 నగదు, 16 గ్రాముల బంగారం, 169 గ్రాముల వెండి వచ్చినట్లు దేవదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవో మంజుల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి అమరవీరుల వారోత్సవాలు


- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి యేటా పోలీసు అమరులను స్మరించుకుంటూ నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఈనెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ నెల 21న అమరవీరుల స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు ఉంటాయన్నారు. 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాలను సందర్శించి పోలీసు అమరుల సేవలను వివరిస్తారన్నారు. అలాగే వారు చదివిన పాఠశాలలకు వెళ్లి అమరుల ఫొటోలు పెట్టుకునేలా సూచించడం ఆ గ్రామంలో ఏదైనా రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలా గ్రామస్తులకు సూచనలిస్తారన్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని వారికి సన్మానం, వారి సేవలను ప్రశంసించనున్నామన్నారు. 31న జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం సందర్భంగా ఉదయం యూనిటీ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగియనున్నాయని తెలియజేశారు.

సామాన్యుడి నుంచి

సౌత్ కొరియా వరకు..



- దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన.. మొట్టమొదటి విదేశీ సైంటిస్ట్ రాజేశ్‌కుమార్
- యువ సైంటిస్టులకు ఆదర్శం
- ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు

బద్వేలు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణం రెడ్డయ్యమఠం వీధిలో నివసించే జ్యోతి రెడ్డప్ప, నాగరాజమ్మ దంపతులకు మొదటి సంతానం రాజేశ్‌కుమార్. ఈయనకు ఓ తమ్ముడు మహేశ్‌కుమార్, చెల్లెలు భవానీ ఉన్నారు. తమ్ముడు మహేశ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. సోదరి భవానీ గృహిణిగా స్థిరపడ్డారు.

అవరోధాలు అధిగమించి

రాజేశ్‌కుమార్ బాల్యమంతా కష్టాల కడలిలోనే సాగింది. కాన్వెంటుల్లో చేరే ఆర్థిక స్థోమత లేక పదో తరగతి వరకు బద్వేలు జడ్పీ బాయిస్ హైస్కూలులో చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ కూడా బద్వేలులోనే పూర్తి చేశారు. ఆ తరువాత పీజీ చేసేందుకు తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో చేరినప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అయ్యేవారు. కానీ ఉన్నత చదువులు చదవాలన్న సంకల్పాన్ని వీడలేదు. ఎస్వీ యూనివర్శిటీలో పీజీ పూర్తి చేసిన వెంటనే పీహెచ్‌డీ చేయాలనుకున్నారు. అందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. అయితే ఎస్వీ యూనివర్శిటీలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న వరదారెడ్డి చేయూతనందించారు. పీలేరు జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా ఉద్యోగం ఇప్పించారు. దీంతో ప్రతి రోజూ తిరుపతి నుంచి పీలేరు వెళుతూ అక్కడి కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేశారు. సాయంత్రం వేళల్లో ఎస్వీ యూనివర్శిటీలో పనిచేసే ప్రొఫెసర్ల పిల్లలకు ఇంటి వద్దకు వెళ్లి ట్యూషన్లు చెబుతూ అనేక కష్టనష్టాలు ఎదుర్కొని అనలిటికల్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఉద్యోగాల వేట

పీహెచ్‌డీ పూర్తి చేసిన వెంటనే రాజేశ్‌కుమార్ ఉద్యోగాల వేటలో పడ్డారు. అయితే 2006లో అమెరికాలో, 2007లో జపాన్‌లో ఉద్యోగాలు పొందినా అక్కడి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఇండియాకు తిరిగి వచ్చేశారు.


జర్మనీకి చెందిన ప్రముఖ ప్రొఫెసర్ భర్ట్‌తో చర్చిస్తున్న రాజేశ్‌కుమార్

దక్షిణకొరియాలో ప్రభుత్వ కొలువు

2007 చివరిలో దక్షిణ కొరియాలో కొరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో సైన్స్‌అండ్ మినరల్స్ సోర్స్‌లో ఉద్యోగాన్ని పొందారు. ఈయన జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. దక్షిణకొరియా ఏర్పడిన 90 సంవత్సరాల కాలంలో అక్కడి ప్రభుత్వంలో పర్మినెంట్ ఎంప్లాయిగా ఎంపిక చేసుకున్న మొట్టమొదటి విదేశీయుడు మన భారతీయుడైన రాజేశ్‌కుమార్.

మైలురాళ్లు..

దక్షిణ కొరియాలో పనిచేస్తూనే 14 దేశాల్లో వారి ఆహ్వానం మేరకు కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొని తన పరిశోధన పత్రాలను సమర్పించారు. 2005లో పీహెచ్‌డీ సమయంలో 2005 బెస్ట్ రీసెర్చ్ స్కాలర్ అవార్డు పొందారు. 2010లో భారతదేశానికి సంబంధించి శాస్త్ర పరిశోధన రంగంలో యువ శాస్త్రవేత్త అవార్డును ఢిల్లీలో అందుకున్నారు.

బ్రిటన్ దేశానికి సంబంధించి లండన్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయల్ సొసైటీ సంస్థలో సభ్యత్వాన్ని కూడా పొందారు. ఈయనవి ఇప్పటి వరకు దాదాపు 70 వరకు పరిశోధనా పత్రాలు ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ వ్యాల్యుమ్స్‌లో ప్రచురించారు. వాటికి సంబంధించి రాజేశ్ పేటెంట్ రైట్స్ కూడా పొందారు. రాజేశ్ కుమార్ కెమిస్ట్రీపై తాను చేసిన పరిశోధన అంశాల పుస్తకాలు అమేజాన్‌లో అందుబాటులో ఉన్నాయి. యువ సైంటిస్టులకు ఇవి దిక్సూచిలా పనిచేస్తున్నాయి.



రాజేశ్‌కుమార్ సైన్స్‌పై ప్రచురించిన పుస్తకాలు

ఫ్లోరైడ్‌పై పరిశోధనలు

18 సంవత్సరాల పాటు దక్షిణ కొరియాలో సైంటిస్ట్‌గా పనిచేశాను. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని ఇండియా-ఆస్ట్రేలియా పార్టనర్‌షిప్ ప్రోగ్రాంలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నా. త్వరలోనే భారతదేశానికి వచ్చి ఫ్లోరైడ్ రహిత నీటి కోసం పరిశోధనలు జరిపి పుట్టి పెరిగిన మాతృ దేశ రుణాన్ని తీర్చుకుంటాను. నేను సాధించిన విజయాల్లో సోదరుడు మహేశ్‌కుమార్, కుటుంబ సభ్యుల సహకారం ఉంది.

- రాజేశ్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్



కొబ్బరికాయల వేలంతో రూ.80లక్షల ఆదాయం

చక్రాయపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కొబ్బరికాయలు విక్రయం వేలం నిర్వహించారు. దీంతో గండికి రూ.80లక్షల ఆదాయం వచ్చింది. శనివారం రూ.10లక్షల డిపాజిట్ కట్టి కొబ్బరికాయల వేలం నిర్వహించగా దాదాపు 10 మంది గుత్తేదారులు పాల్గొన్నారు. వేంపల్లె వాసి వెంకటరమణారెడ్డి రూ.80లక్షలకు పాట దక్కించుకున్నాడు. కొబ్బరికాయల వేలంతో వచ్చిన ఆదాయం రూ.80లక్షలకు జీఎస్టీ 18శాతం కలిపి ఒకేసారి చెల్లించాలని ఈఓ కోరారు. జీఎస్టీతో కలిపి రూ.94లక్షలు చెల్లించాల్సి ఉండగా సగం చెల్లించారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ గ్యారెంటీతో గడువు కోరారు. ఏదేమైనా రికార్డుస్థాయిలో గండికి ఆదాయం రావడం విశేషం. దేవాదాయ జిల్లా అధికారి ఇన్‌స్పెక్టర్ శివయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, భాస్కర్, సీఐ నాగరాజు, ఎస్ఐ కృష్ణయ్య, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజా ఫౌండేషన్ సందర్శించిన జడ్జి

● విద్యార్థులకు పండ్లు పంపిణీ


విద్యార్థులకు పండ్లు అందిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి మైలవరం రాజా ఫౌండేషన్ (డాడీహోం) సందర్శించారు. శనివారం ఆమె వృద్ధులు, అభాగ్యులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డాడీహోంలో పనిచేస్తున్న రాధా, కవిత సేవలను జడ్జి అభినందించారు. సేవలు చేస్తున్నవారిని, విద్యార్థులను సందర్శించి పలకరించడం చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం మైలవరం మండలం దొమ్మరనంద్యాల బీసీ హాస్టల్, మైలవరంలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. న్యాయవాదులు జంబాపురం మహేశ్వరి, జ్యోతి, పెద్దిరాజు, ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకులతో అంతర్జాతీయ ప్రాజెక్టు


ప్రాజెక్టు పత్రాలను తీసుకుంటున్న వైవీయూ అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇద్దరు ప్రొఫెసర్లకు అమెరికా వాషింగ్టన్‌లోని హెల్త్ సొసైటీ పార్టనర్ సంస్థ ప్రాజెక్టు మంజూరు చేసింది. వృక్ష శాస్త్ర ప్రొఫెసరు చంద్ర ఓబులరెడ్డి, బయోటెక్నాలజీ ప్రొఫెసరు చంద్రశేఖర్ ప్రాజెక్టు పత్రాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి ద్వారా అందుకున్నారు. మొక్కల స్టాకేస్‌పై పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు ఇచ్చే శిక్షణ, విధివిధానాలకు వీరు రూపకల్పన చేస్తారు. శాస్త్రవేత్తలు సమగ్ర జీవభద్రత శిక్షణను అభివృద్ధి చేయడానికి వీరు కృషి చేస్తారు. అంతర్జాతీయస్థాయిలో ప్రాజెక్టు ఫలితాలు అమలు చేయనున్నారు. వైవీయూ ప్రొఫెసర్లకు అంతర్జాతీయ స్థాయి లభించడం పట్ల వైస్‌చాన్సలరు, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ, ప్రొఫెసరు గంగిరెడ్డి, డాక్టర్ గోవర్ధనరెడ్డి, దూర విద్య ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్


విలేజ్ క్లినిక్ పరిశీలనలో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బి.కోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మేకవారిపల్లె పీహెచ్‌సీని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్‌ఓస్టాటిస్టికల్ ఆఫీసర్ రమేశ్ రెడ్డి, డీపీఓ కుమార్‌నారాయణ, డీపీహెచ్ ఎన్‌ఓ అరుణ్ కుమారి, ఏఎస్‌ఓ జాకబ్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించాలని ప్రసవానికి హాస్పిటల్‌కు తీసుకురావాలని బిడ్డకు బిడ్డకు ఎడమ ఉండాలని, రక్తహీనత తగ్గించాలని, కౌమార దశ విద్యార్థినులకు (బాలికలకు) హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించి హెచ్‌బీ తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు డబుల్‌డోస్ ఇవ్వాలని సూచించారు. వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్‌లో రాష్ట్రంలో తంగేడుపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ మొదటిస్థానంలో నిలిచిందని గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో అందించాలని హైరిస్క్ గరిణులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సీహెచ్‌ఓ నాగమణి, సీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, విజయలక్ష్మి, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఎఫ్‌హెచ్‌ఓలు, హెల్త్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నాక్‌పీర్ చైర్మన్‌గా ప్రొఫెసరు శ్రీనివాసులు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎకనామిక్స్ ప్రొఫెసరు శ్రీనివాసులు నేషనల్ అసెస్‌మెంటు అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ పీర్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ప్రముఖ మహాత్మాగాంధి డిగ్రీకళాశాలను 23, 24తేదీల్లో సందర్శించనున్నారు. ఈ బృందానికి సమన్వయ కర్తగా డాక్టర్ ఎస్ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లు మెంబరు కోఆర్డినేటరు మెంబర్లుగా ఉన్నారు. ఆయన ఎంపిక పట్ల వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మార్కే కళాశాలను సందర్శించిన వీసీ


సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ అనుబంధ కళాశాలలైన భీమవరం ఎమ్మార్కే కళాశాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ శనివారం సందర్శించారు. కళాశాలలోని విద్యాప్రమాణాలు, సౌకర్యాలు పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై కళాశాల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు.

సమష్టి కృషితో కళాశాల అభివృద్ధి : ఆర్‌జేడీ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో కళాశాల అభివృద్ధికి పాటుపడాలని ఆర్‌జేడీ డాక్టర్ గిరి అన్నారు. శనివారం కడప నగరం కోటిరెడ్డి మహిళా కళాశాలను సందర్శించిన ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమై కళాశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధ్యాపకుల సామర్థ్యం మెరుగుపరచుకుంటూ నూతన పోకడలను అనుసరిస్తూ విద్యార్థులకు విద్య, ఉద్యోగపరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డేకి ఆర్‌జేడీ హాజరయ్యారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

98 పరుగులకే కుప్పకూలిన వెస్ట్ గోదావరి

6 వికెట్ల నష్టానికి 112 పరుగులతో ఈస్ట్ గోదావరి

కడప (స్పోర్ట్స్) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో శనివారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో వెస్ట్ గోదావరి జట్టు కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. మరో మ్యాచ్‌లో ఈస్ట్ గోదావరి జట్టు 6 వికెట్లు కోల్పోయి 112 పరుగులు మాత్రమే చేసింది.

● నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన వెస్ట్ గోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి 76.1 ఓవర్లలో కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. ఇందులో టి. శ్రీ సూర్యసాయిమణికంఠ (బ్యాటర్) 94 బంతుల్లో 17 పరుగులు చేయడం విశేషం.

● నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం మైదానంలో ఈస్ట్‌గోదావరి - ప్రకాశం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఈస్ట్ గోదావరి జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 41.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. ఇందులో రాజ్‌ఆర్యన్ (బ్యాటర్) 22 పరుగులు, రేవంత్ (బ్యాటర్) 32 పరుగులు చేశారు. కాగా రెండో రోజైన ఆదివారం ఆటకు చివరిరోజు.

రోడ్లు జలమయం - ప్రగతికి గ్రహణం

చినుకుపడితే రోడ్లు బురద మయం ● రూ.130 కోట్లలో సగం కూడా ఖర్చుకాని వైనం
అవస్థలుపడుతున్న జనం ● ప్రజాప్రతినిధులు హీనం


జలమయమైన మైదుకూరురోడ్డు

బద్వేలుటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బద్వేలు రోడ్లు దయనీయంగా మారాయి, వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 130 కోట్ల ప్రగతికి గ్రహణం పట్టింది. మూడు పంచాయతీలుగా ఉన్న బద్వేలు మున్సిపాలిటీగా పురోగతి చెంది 14 ఏళ్లు దాటి రెండు పాలకవర్గాలుపూర్తయి, మూడో పాలకవర్గంలో నడుస్తున్నా వార్డుల్లో రహదారులు, మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చినుకు పడితే ప్రధాన వార్డుల్లో రహదారులపై సైతం వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంటాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. నియోజకవర్గం అభివృద్ధి కోసం మంజూరైన రూ. 130 కోట్లు నిధులు ఏమయ్యాయో ఎవరికీ అంతు చిక్కడం లేదు. అధికారులను అడిగితే సగం నిధులు ఖర్చయ్యాయని చెప్పు కొస్తున్నారు. ప్రజలు మురుగు తో సావాసం చేస్తున్నట్లే వివరాల్లోకెళితే....

మురుగునీరుపారితే...

చిన్నపాటి వర్షం కురిసినా నీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహించడం సర్వసాధారణమైంది. కొన్నిచోట్ల కాల్వల్లో పూడికతీత తీయకపోవడం, మరికొన్నిచోట్ల మురుగు కాల్వలు లేకపోవడంతో వర్షంనీరు, మురుగునీరు పోయే మార్గం లేకపోయింది. దీనికితోడు మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర పదార్థాలు పేరుకుపోయాయి. బ్రహ్మంసాగర్ తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తోంది. పబ్లిక్ వాటర్, మురుగునీరు నిత్యం రోడ్లపై దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

పట్టించుకున్న నాథుడేలేడు

ప్రజా సమస్యలను పాలకవర్గం, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాకాలం వచ్చిందంటే మురుగుకాల్వల్లో మురుగునీరు, వర్ష పునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దీనికితోడు ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, శివానగర్‌వాసి

మున్సిపాలిటీలో మొత్తం 35వార్డుల్లో 58కిలోమీటర్ల మేరకు డ్రైనేజీ కాల్వలు పూర్తిచేయాల్సి ఉండగా వాటిల్లో కొంత మేరకు అంతంత మాత్రమే పూర్తి చేశారు. రూ.130కోట్ల నిధుల్లో రూ.47కోట్లు మాత్రమే ఖర్చుచేయడంతో పట్టణ అభివృద్ధికి గ్రహణం పట్టినట్లైంది. గతంలో జనావాసాలు లేనిచోట్ల వైసీపీ నేతలు పొలాలకు, వారి స్థలాలున్నచోట్ల సీసీ రోడ్లను ఏర్పాటు చేసుకున్నారు. జనావాసాలున్నచోట్ల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో రోడ్లు, కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, మున్సిపాలిటీ పాలకవర్గం అభివృద్ధి పనులను ప్రారంభించి మురుగు కాల్వలు, రోడ్లనిర్మాణ పనులను చేపట్టి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.


రెడ్డెయ్యమఠం వీధిలో అధ్వానంగా రహదారులు


శివానగర్‌లో అధ్వానంగా సీసీరోడ్లు, మురుగు కాల్వలు

పన్నులు కట్టించుకుంటారే తప్ప...

పన్నుల వసూళ్లపై పెట్టే శ్రద్ధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై పెట్టకపోతున్నారు. మురుగు కాల్వల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికల సమయంలో తప్ప సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదు.

నాగరాజు, శివానగర్‌వాసి

రూ. 10 లక్షల బకాయిలపై ఆరా

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ ● రికవరీ జరగకపోతే చట్టపర చర్యలు
స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్


ఎగువగొట్టివీడులో విచారణ చేస్తున్న అధికారులు

గాలివీడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ చేస్తున్నట్లు స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో స్త్రీనిధి బకాయిలపై విచారణ జరిపారు. మండలంలో మొత్తం రూ.10 లక్షల వరకు బకాయిలు ఉండగా అందులో అత్యధికంగా గొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో స్త్రీనిధి సొమ్ము రూ.4.15 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. ఇదే విషయమై మహిళా సంఘ సభ్యులను విచారించగా ఇప్పటికే చాలా వరకు బకాయిలు చెల్లించామని, అయినా ఎక్కువ మొత్తంలో అప్పు చూపిస్తున్నట్లు ఆరోపిస్తున్నారన్నారు. అయితే అవి బకాయిలా లేక వెలుగు సిబ్బంది చేతివాటంతో నిలిచిపోయిన అప్పా అనే విషయం క్షేత్రస్థాయిలో రసీదులు, బుక్కులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. మండలంలో గుండ్లచెరువు రూ.80,900, సీసీ పల్లె రూ.65 వేలు, తూముకుంట రూ.29,500, అరవీడు రూ.32,000 బకాయిలు ఉన్నాయన్నారు. శనివారం జరిగిన విచారణలో రూ.1,20,000 రికవరీ కాగా అందులో గుండ్లచెరువు నుంచి రూ.30 వేలు, నూలివీడు రూ.75 వేలు, పూలుకుంట రూ.15 వేలు ఉన్నట్లుగా తెలిపారు. విచారణ అధికారులు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి స్వాహా అయిన స్త్రీనిధి సొమ్మును రికవరీ చేసి, కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ మౌనిక, లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం పెద్దరెడ్డెయ్య, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

● రూ.6 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం : డీఎస్పీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా దొంగలను అరెస్టు చేసి ఆరు లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలి వాసి నడింపల్లి గోపీ, నెల్లూరు పట్టణం గుడిపిల్లపాడు ప్రాంతం లక్ష్మీగణపతి వీధికి చెందిన లింగుబెరి రాంబాబు జూన్ 30న పట్టణంలోని లక్ష్మీపురంలో రెండు ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీపై కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం వారిని అరెస్టు చేసి, రూ.6 లక్షల విలువైన 86.500 గ్రాములు బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కనిగిరి, వేదాయపాలెం, యలమంచిలి, నెల్లూరు, పత్తిపాడు, సింగరాయకొండ, జలదంకి, పొదలి, కావలి, చిలకపూడి, పామూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదైనట్లు వివరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, పోలీసు సిబ్బంది రామచంద్ర, బరకతుల్లా, మహేందరనాయుడు, పెంచలయ్య, మహేంద్ర, టెక్నికల్ అనాలసిస్ వింగ్ కానిస్టేబుల్ రవి తదితర సిబ్బందిని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం


విరాళం అందిస్తున్న శ్రీనివాసులు

చక్రాయపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం వేంపల్లె వాసి చెల్లుబోయిన శ్రీనివాసులు వారి ధర్మపత్ని మల్లమ్మ రూ.1,00,516 విరాళంగా ఇచ్చారు. టెంకాయలు విక్రయించే దుకాణంలో పనిచేసే వ్యక్తి విరాళమివ్వడం అభినందనీయమని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్నారు. మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలు ఇచ్చి మెమెంటో అందించారు. ఇలాంటి దాతలు ముందుకురావాలని ఏసీ కోరారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అటెంప్ట్ మర్డరు కేసులో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్న చాటకొండు గురయ్యను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఏడు నెలలుగా గురయ్య పరారీలో ఉన్నాడని శనివారం సీతారాంపురం క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి బద్వేలు కోర్టుకు హాజరుపరచామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య - కేసు నమోదు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి భూమిరెడ్డి నాగిరెడ్డి (30) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె వాసి భూమిరెడ్డి సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి పంట సాగు చేసేవాడు. ఇటీవల పెట్టిన పంటకు కనీస మద్దతు ధర రాకపోవడంతో అప్పులు ఎక్కువై మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం విషద్రావణం తాగాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

నలుగురు దొంగలు అరెస్టు

కడప క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో కాపర్, సిల్వర్ వైర్లు అపహరించే నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేశ్, కడప నిరంజన్‌నగర్ వాసులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఖాజాహుసేన్ కాపర్, సిల్వర్ వైర్లు దొంగిలించి ముద్దలుగా చేసి విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సా చేసేవారు. దొంగలించిన కాపర్, సిల్వర్ వైర్లతో పారిపోతుండన్నట్లు అందిన సమాచారంతో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నలుగురిని రిమ్స్ రోడ్డు రైల్వే ట్రాక్ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 150 కిలో కాపర్ వైరు 50 కిలోల సిల్వర్ వైర్లు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామన్నారు.

16 మందిని కరిచిన పిచ్చికుక్క


చికిత్స పొందుతున్న బాలుడు

మైదుకూరు రూరల్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వనిపెంట రోడ్డులోని ఎర్రచెరువు వద్ద నుంచి నంద్యాల రోడ్డు బైపాస్ వరకు సుమారు 16 మందిని ఓ పిచ్చికుక్క కరిచి గాయపరిచింది. దారి వెంబడి కనపడిన వారందరినీ కుక్క కరుస్తుండడంతో స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు సమాచారం అందించారు. కుక్కను పట్టుకునేందుకు అధికారులు సిబ్బందితో ప్రయత్నాలు చేస్తున్నారు. గాయపడిన వారు మైదుకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

24న అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్‌పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు 24న బద్వేలు బిజివేముల వీరారెడ్డి కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బోర్డు సెక్రటరీ రావసుబ్బారెడ్డి తెలిపారు. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబల్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టరు సంతకం చేసిన ఎలిజబులిటీ ఫాం, కళాశాల ఒరిజినల్ సర్టిఫికెట్‌పై ఫొటోపై అటెస్టేషన్ చేయించాలన్నారు. టెన్త్, ఇంటర్ మార్కులజాబితా ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని, క్రీడాకారులు జూలై 1, 2024 నాటికి 17 నుంచి 25 ఏళ్ల వయసు కలిగిఉండాలన్నారు. ఇతర సమాచారం కోసం 9000294626, 9705459052 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఒంటిమిట్టలో మాక్‌డ్రిల్

ఒంటిమిట్ట, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండ రామాలయంలో వచ్చే భక్తులకు విపత్కర పరిస్థితుల నుంచి రక్షించేందుకు ఆక్టోపస్ ఆధ్వర్యంలో పోలీసు విన్యాసాలు నిర్వహించారు. ముందుగా మండలంలోని అన్ని శాఖల అధికారులు, స్థానిక పోలీసు అధికారులతో టీడీపీ భవనంలో ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య, జగ్గనాయుడు నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉగ్రవాద సంస్థల నుంచి ప్రముఖ ఆలయాలకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో మెడికల్, ఎలక్ట్రికల్, ఫైర్, రెవెన్యూ అధికారులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. రాత్రి 9 గంటల సమయంలో కల్యాణవేదిక ప్రాంతంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐ శివప్రసాద్, డాక్టర్ హిమశ్వేత, డిప్యూటీ తహసీల్దారు గౌరి, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల శ్రేయస్సే చంద్రబాబు లక్ష్యం

ఒంటిమిట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల శ్రేయస్సే చంద్రబాబు లక్ష్యం అని మండల టీడీపీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక కోదండరామాలయం వెనుక భాగంలో ఉచిత ఇసుక పథకంపై చంద్రబాబునాయుడు ప్రకటన చేసినందుకు స్థానిక టీడీపీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. టీడీపీ నాయకులు గజ్జల నరసింహారెడ్డి, చింతరాజుపల్లి రమణ, ఎంపీటీసీ సభ్యుడు సుంకేసుల బాషా, మండపంపల్లె శివశంకర్ రెడ్డి, ఎస్వీ రమణ, బొబ్బిలి రాయుడు, మద్దు కృష్ణారెడ్డి, మౌలాలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేరాలపై నిరంత నిఘా ఉంచాలి

ఒంటిమిట్ట, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : నేరాలపై నిరంతరం నిఘా ఉంచాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో నేరాల తీవ్రతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అసాంఘిక శక్తులపై నిఘా ఉంచాలని, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలపై నిరంతరం పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ

నందలూరు, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఉన్న అభ్యసన వైకల్యాలపై అవగాహన కల్పిం చేందుకు శనివారం సమ్మిళిత ఉపాధ్యాయులు ఆధ్వ ర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా నాగిరెడ్డిపల్లె పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు జయలలిత మాట్లాడుతూ అక్షరా లు తలకిందులుగా రాయడం, వెనక్కు రాయ డం, అక్షరాలు వదిలి చదవడం, రాయడం, గణితంలోను, మాట్లాడటంలోను, అర్థం చేసుకోవడంలోను, గుర్తించ డంలోను సమస్యలున్న పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నవయసులోనే గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తే వారి సామర్థ్యాలు మెరుగుపడి సాధారణ పిల్లల వల్లే అన్నిరంగాల్లో రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత ఉపాధ్యాయు లు రంగస్వామి, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలివీడు: అవగాహన పెంచడం, సహాయక పద్ధతు లను ప్రోత్సహించడం ద్వారా డిస్లెక్సియాను అధిగ మించి, విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేయవచ్చునని ఎంఈవో-2 వేల్పుల శ్రీని వాసులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు డిస్లెక్సియాపై అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట చల పతి, ఐఈఆర్పీ ఖలందర్, కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంబేపల్లె: భవిత కేంద్రం ఆధ్వర్యంలో సంబేపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమాదేవి ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావునాయక్, ఉపాధ్యా యులు జయమ్మ, భవిత కేంద్రం శిక్షణ ఉపాధ్యా యులు రవిచంద్రప్రసాద్, హరిత, సుజాత, ప్రత్యేక అవసరాల పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: విద్యార్థుల్లో అభ్యసనకు సంబంధిం చిన లోపాలు సరిదిద్దాలన్న



గాలివీడులో డిస్లెక్సియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాధికారులు

లక్ష్యంతో శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రం ఆధ్వర్యంలో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌యం సైరాబాను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, ఐఈఆర్టీలు త్రిలోక్, జనార్దన్, సీజీవీ రాధా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు ఉన్న పిల్లలందరికి ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపా యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్యా అన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో డిస్లె క్సియా మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వ హించారు. ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయురాలు విజయ కుమారి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లల్లో కనీస వసతులు కల్పించండి

రైల్వేకోడూరు, అక్టోబరు 19:(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస వసతు లు కల్పించాలని రైల్వేకోడూరు కోర్టు జడ్జి పీజే తేజసాయి వార్డన్లను ఆదేశించారు. శనివారం మండలంలోని వీపీఆర్ కండ్రికలో ఉన్న వృద్ధాశ్రమం, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని ప్రభుత్వ వసతి గృహాలు అనంత రాజుపేట గిరిజన మినీ గురుకులాల్లో విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహాల్లోకి దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వసతి గృహాలలో ఉన్న అసౌకర్యాలను పై అధికారులకు తెలియజేసి పరిష్కరించాలన్నారు. వీపీఆర్ కండ్రిక సమీపంలో ఉన్న సాయి ఈశ్వరమ్మ ఆశ్రమంలో వృద్ధులకు సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండాలన్నారు. ఆశ్రమానికి ప్రహరీ గోడతో పాటు గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఓబులవారిపల్లె: మండలంలోని పాపిరెడ్డిపల్లెలో ఉన్న జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో వసతులను జిల్లా జడ్జి సాయితేజ పరిశీలించారు. అనంతరం ఆశ్రమవాసులను అక్కడ అందించే సౌకర్యాలను, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలోని కొందరు వృద్ధులు ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు నమోదు కాలేదని జడ్జిని కోరగా వివరాలు నమోదు చేసుకుని పరిశీలించి న్యాయం


రైల్వేకోడూరు బీసీ కళాశాల వసతి గృహంలో వార్డెన్‌తో మాట్లాడుతున్న జడ్జి తేజసాయి

చేస్తామని తెలిపినట్లు ఆశ్రమం చైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం తెలిపారు. ఎల్లాయపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న చిన్మయారణ్యం ఆశ్రమం, బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వసతులు పరిశీలించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు.

మహిళల రక్షణ అందరి బాధ్యత

సుండుపల్లె, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల సంరక్షణ మనందరి బాధ్యతని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, గుడ్ నైబర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్ తెలిపారు. మానవ అక్రమ రవాణా నిషేధ దినోత్సవం సందర్భంగా శనివారం జీకేరాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండియా, ముంబై ఆర్గనైజేషన్ వారి సహకారంతో గుడ్ నైబర్స్ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ ,విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. చిన్న పిల్లలను పట్టణ ప్రాంతాలకు రవాణా చేసి భిక్షాటన చేయిస్తున్నారని, బాలికలను ఉపాధి పేరుతో వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారని తెలియజేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అడ్డుకొని మహిళలను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, పిల్లల సంరక్షణ లీగల్ అధికారి కౌరున్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గుడ్ నైబర్స్ ప్రతినిధులు

వీరబల్లి: మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరమని దానిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డెయ్య, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. శనివారం వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమంపై ది మూమెంట్ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ, వీఆర్‌డీఎస్ సంస్థ సంయుక్తంగా నిశ్శబ్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమా ర్, పల్లం రామచంద్ర, రాజశేఖర్, సుబ్బారెడ్డి, సతీశ్ బాబు, వీఆర్‌డీఎస్ వలంటీర్లు నాగయ్య, నాగార్జున, గోపి, శ్రీను, వెంకటకిశోర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ

పుల్లంపేట, అక్టో బరు 19 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని బావికాడ పల్లె పంచాయతి రామాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం కింద ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సిమెంట్‌రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు సమకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, మండల పార్టీ అధ్యక్షుడు ఆరె. సుధాకర్ ముక్కా సాయివికాస్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ కాపె ర్ల చంద్ర శేఖర్‌నాయుడు, ఆరె జనార్దన్‌నాయుడు, చుండు ఈశ్వర్ నాయుడు, రెడ్డయ్య నరసింహులు, కుప్పాల మణి, నరసాపురం శివాజీ, పసుపులేటి వెంకటరమణ, కొండేటి చెంగయ్య పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని కొర్లకుంట, చలంపాలెం గ్రామాల్లో టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో మల్లిరెడ్డి, ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, ఏఈ ఆంజనేయప్రసాద్, పలువురు ప్రభుత్వ అధికారులు, టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ

రామాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం 13 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులను నిర్వహించినట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వివరించినట్లు తెలిపారు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): అర్హులైన వారికి ప్రమో షన్లు కల్పించి మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత సమస్య పరిష్క రించాల ని అన్నమయ్య జిల్లా యూటీ ఎఫ్ అ ధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసా ద్, జాబీర్ డిమాండ్ చేశారు. యూటీ ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మేనేజ్‌మెంట్లలో పండిట్ పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ కాగా, మున్సిపల్ పాఠశాలల్లో కాలేదన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ ఎం, అర్బన్ ఎంఈవో ప్రమోషన్‌లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయు లకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, వెంటనే బదిలీలు చేయాలని, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమిం చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 24న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, హేమలత, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌వర్సిటీ కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

రాజంపేట, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో త్వరలో జరగనున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ మహిళా కబడ్డీ పోటీలకు రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని పి.మానస, కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె.అఖిలారెడ్డి ప్రతిభ ప్రదర్శించి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరికి అన్నమాచార్య విద్యా సంస్థల వైస్‌చైర్మన్ ఎల్లారెడ్డి ప్రోత్సాహక అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమలో పీఈటీలు బి.నాగముని, సైఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయికి నాగిరెడ్డిపల్లె విద్యార్థి

నందలూరు, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి ప్రణీత్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. కడపలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రణీత్ రాష్ట్రస్థాయికి ఎంపికైనవారిలో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరి, విద్యార్థి ప్రణీత్ ను ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పాటూరు విద్యార్థినులు

నందలూరు, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పాటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప స్పోర్ట్స్ స్కూల్లో శనివారం నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థిని సి.సంధ్యారాణి ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని. మరో విద్యార్థిని బి.నక్షత్ర కూడా స్టాండ్ బై ప్లేయర్‌గా ఎంపికయ్యారని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామాపురం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో చికిత్స పొందుతూ షేక్. తహరిన్ (70) శనివారం మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం మండల హసనాపురం పంచాయతీ కస్పాకు చెందిన షేక్. తహరీన్ సెప్టెంబరు 17న గ్రామం చివర్లోని గేదెలు తోలుకుని వెళ్లింది. అక్కడ ఆమెను పాముకాటు వేయడంతో తన కుటుంబీకులు చికిత్స కోసం రాయచోటి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కోర్టు భవనాల దుస్థితిపై జిల్లా జడ్జి ఆందోళన

రాయచోటిటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాలకు మరమ్మతులు చేయకపోతే త్వరలోనే అవి కూలిపోయే ప్రమాదం ఉందని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు భవనాల మౌల్డింగ్ దుస్థితిని చూసి విచారం వ్యక్తం చేశారు. రాయచోటి పాత కోర్టు భవనాల సముదాయ ప్రాంతంలో అడిషనల్ ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు కోసం 2014లో భవనాన్ని నిర్మించారు. ఈ భవనానికి మోల్డింగ్ వేసిన సమయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో, వర్షాకాలంలో నీరు నిలుస్తోందని జడ్జి దృష్టికి రావడంతో శనివారం సాయంత్రం ఆయన ఏజీఎం కోర్టు బిల్డింగ్‌ను పరిశీలించారు. పదేళ్లకే బిల్డింగ్ ఈ స్థితికి రావడం చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోడ్లు, భవనాల శాఖ వారు బిల్డింగ్ లోపాలను సరిదిద్దకపోతే 20 ఏళ్లైనా పూర్తి కాకమునుపే బిల్డింగ్ కూలిపోయే అవగాశం ఉందని అభిప్రాయపడ్డారు. వన్‌స్టాప్ సెంటర్లు, గర్ల్స్ హాస్టల్, కాలేజీ గర్ల్స్ కాలేజీతో పాటు శక్తి సదన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల గదులను, వంటగది, స్టోర్‌రూమ్, బాత్‌రూమ్‌లను పరిశీలించి అక్కడ విద్యార్థులు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం కల్పి స్తున్న అన్ని వసతులను అందజేయాలని వార్డన్‌లకు తెలియజేశారు. అలాగే వన్‌స్టాప్ సెంటర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు.


ఏడీయం కోర్టు దుస్థితిని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి

ఇసుక క్వారీ పకడ్బందీగా నిర్వహించాలి

పెనగలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు ఇసుక క్వారీలను పకడ్బందీగా నిర్వహించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి సూచించారు. శనివారం సాయంత్రం కోమంతరాజపురం, నారాయణ నెల్లూరు ఇసుక క్వారీలను ఆమె ప్రారంభించారు. అంతకు ముందు ఆమె కాంట్రాక్టర్లు, స్థానిక అధికారులతో చర్చించారు. డంపింగ్‌యార్డుకు ఇసుక తీసే క్వారీకి ఎంత దూరం ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. అలాగే 2 క్వారీల ఇసుక ఏ మార్గంలో వెళుతుంది అనే వివరాలు తెలుసుకున్నారు. వాహనాలు ప్రధాన రోడ్డు ఎక్కే చోట, స్టాక్ పాయింట్ వద్ద, దారిమధ్యలో 3 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసు, రెవెన్యూ , సచివాలయ సిబ్బంది నియామకాల వివరాలను తహసీల్దారు, ఎస్ఐ, ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడ అధికారులపై ఉందన్నారు. తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, ఎంపీడీవో విజయరావు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి, కోమంతరాజపురం క్వారీ కాంట్రాక్టర్ ఎం.నరేష్‌నాయుడు, నారాయణనెల్లూరు క్వారీ కాంట్రాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎం.రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇసుక క్వారీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిధియాదేవి

దోమల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ కోసం ప్రజలు సామూహికంగా చర్యలు తీసుకోవాలని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామ పంచాయతీలో దిగువ కంచరపల్లెలో లార్వా సర్వే నిర్వహించారు. యండపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌వో లలితకుమారి, ఎంపీహెచ్ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతు భరోసా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఖాతాల్లో జమ చేయాలన్నారు. వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి

పుల్లంపేట, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : స్థానిక చిట్వేలిరోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించి వేరే ప్రాంతంలో పెట్టుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని మహిళా సమాఖ్య జిల్లా ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలకు 85 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసిన ఈ దుకాణంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి సెల్వన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునగాకుతో ఆరోగ్యం : సీడీపీవో

రామాపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో మునగాకు తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి తెలిపారు. మండలంలోని గువ్వలచెరువు సెక్టారు, రామాపురం సెక్టార్‌లోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులు, బాలింతలకు, మహిళలకు ఆరోగ్యం, ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకునే ఆహారలో విటమిన్ ఏ, విటమిన్ బీ1, బీ2, బీ3, బీ6, విటమిన్ సీ, కాల్షియం తదిత పోషకాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ హుస్సేనమ్మ, పద్మజ, అంగన్వాడీ టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.


మునగాకుపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో పద్మావతి

చిట్వేలి: అత్యంత పోషక విలువలు కలిగి ఔషద గుణాలు పుష్కలంగా ఉన్న మునగాకు, మునక్కాయలను ప్రతిఒక్కరు విధిగా తీసుకోవాలని చిట్వేలి సీడీపీవో రాజేశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామాజిక వేడుక నిర్వహించారు.

చిన్నమండెం: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద ఆధ్వర్యంలో దేవగుడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో మునగాకుతో ప్రయోజనాలపై ఏసీడీపీవో సుగుణ అవగాహన కల్పించారు. .

కలెక్టర్ చొరవతో కేజీబీవీ సమస్యల పరిష్కారం

వీరబల్లి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించడంతో అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కారం అయ్యాయి. గత నెలలో పరిశీలనకు వచ్చిన సందర్భంగా అక్కడి సమస్యలపై ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయా సమస్యల పరిష్కారానికి ఆయన నిధులు విడుదల చేశారు. పనులు చేయించాలని అప్పటి ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డిని ఆదేశించారు. రోడ్డు నుంచి కేజీబీవీ స్కూలు వరకు త్వరలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు. అసంపూర్తిగా ఉన్న కళాశాల రక్షణ గోడ ఉందని పూర్తి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు అవకాశం ఇవ్వద్దు

ఒంటిమిట్ట, అక్టోబరు 19 : (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు అవకాశం ఇవ్వవద్దని ఎంపీడీవో సోమశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఉపాధిహామీ భవనంలో సోషల్ ఆడిట్‌పై ఉపాధిహామీ, పంచాయతి రాజ్ సిబ్బందితోసమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో చేసిన ఉపాధి పనుల్లో నాణ్యత, అవకతవకలను సోషల్ ఆడిట్ సిబ్బందిపరిశీలించి ఎలాంటి లోటుపాటున్నా కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

రామాపురం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. కుమ్మరపల్లి వద్ద పద్మావతి కోళ్ల ఫాంలో పనిచేస్తున్న గోవిందరాజు(21) శుక్రవారం రాత్రి మద్యం తాగి భార్య వల్లెమ్మతో గొడవ పెట్టుకుని పురుగుల మందు తాగాడు. దీంతో అతనిని కడప రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫుట్‌బాల్ @ సిద్ధమ్మగారిపల్లె



2022లో ఆరోగ్యవరంలో విన్నర్స్. రన్నర్స్‌గా నిలిచిన సిద్ధమ్మగారిపల్లె క్రీడాకారులు


సిద్ధమ్మగారిపల్లె


ప్లాట్లుగా ఫుట్‌బాల్ క్రీడా మైదానం


జాతీయ క్రీడాకారులు నరేశ్, రిఖిల్

- గ్రామంలో 50 మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు
- స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి...
- మూడు తరాలుగా ఫుట్‌బాల్ క్రీడ వారసత్వం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని పోతబోలులో చిన్నఊరు సిద్ధంగారిపల్లె. మదనపల్లె పట్టణానికి కూతవేటు దూరంలో ఆ గ్రామం ఉంది. ఆ గ్రామస్తులకు మూడు తరాల నుంచి ఫుట్‌బాల్ క్రీడ వారసత్వంగా వస్తోంది. ఫుట్‌బాల్‌లో స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ప్రస్తుతం 50 మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులున్న చిన్న పల్లె అది.

ఫుట్‌బాల్ క్రీడకు స్ఫూర్తి డాక్టర్ జెషోడియన్

మదనపల్లెకు 5 కిలోమీటర్ల దూరంలో క్షయవాధి నివారణ కేంద్రాన్ని 1910లో స్థాపించారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌గా పేరు ఉన్నప్పటికీ శానిటోరియంగా ప్రసిద్ధికెక్కింది. ఇందులో సూపరింటెండెంట్‌గా డాక్టర్ జెషోడియన్ వచ్చారు. అనంతరం అతను ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడంతో మొదటగా సిద్ధంగారిపల్లెకు చెందిన కాలవపల్లె గంగయ్య కుమారుడు జీకే వెంకటరమణ ఫుట్‌బాల్ ఆడడానికి సుముఖత చూపడంతో డాక్టర్ జెషోడియన్ తర్ఫీదు ఇవ్వడంతో ఆట మొదలైంది. చిన్నతనం నుంచే తండ్రి వద్ద బెంగళూరు నుంచి రబ్బర్‌బాల్ తెప్పించుకుని ఊళ్లో ఆడుకునేవారమని జీకే వెంకటరమణ తెలిపారు. ఆరోగ్యవరంలోని యుఎంటీఎస్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. 1956లోనే ఆరోగ్యవరంలో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏర్పాటు చేసి అక్కడ ఫౌండర్ జెషోడియన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం 1957-58లో ఆరోగ్యవరంలో జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వెంకటరమణ సీనియర్ జట్టుతో వెళ్లి కడప, తిరుపతి ప్రాంతాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. బీటీ కళాశాలలో చదువుతున్న రోజుల్లో లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన యూనివర్సల్ ఇంటర్ కాల్ జట్టు తరపున ఆడారు.

స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి...

సిద్ధంగారిపల్లె క్రీడాకారులు స్కూల్ గేమ్స్ స్థాయి నుంచి జాతీయ ఫుట్‌బాల్ అండర్-14 జట్టుకు ఇద్దరు ఎంపికయ్యారు. గత నెలలో గౌహతిలో జరిగిన పోటీల్లో వీరు పాల్గొని ప్రతిభ చూపారు. సిద్ధమ్మగారిపల్లెకు చెందిన కె.చెన్నకేశవులు, సుజాత కుమారుడు కె.నితీష్, ధనుంజయ, రెడ్డినాగేశ్వరి కుమారుడు ఎస్.రిఖిల్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు స్కూల్ గేమ్స్‌తో పాటు ఇంటర్ జిల్లా స్థాయి జట్టులో క్రీడల్లో పాల్గొన్నారు. వైజాగ్, ఏలూరులో జరిగిన పోటీల్లో పాల్గొని అనంతపురం ఏపీ క్యాంపులో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14లో ఎ.సాయి కిరణ్ ఇంటర్ జిల్లా స్థాయిలో విశాఖపట్టణంలో ఆడి రాష్ట్ర స్థాయి క్రీడల్లో కూడా పాల్గొన్నారు. అలాగే డి.నరేష్ ఇంటర్ డిఫెన్స్ కళాశాల తిరుపతిలో చదువుతున్నాడు. ఇతను స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 జిల్లా స్థాయిలో కడప, కర్నూల్, నెల్లూరు, చిత్తూరులో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఇంటర్ జిల్లా స్థాయిలో కర్నూల్‌లో విన్నర్‌గా నిలిచి జాతీయ స్థాయిలో అండమాన్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. వి.కార్తీక్ ఇంటర్ ఎస్వీ డిఫెన్స్ అకాడమీ తిరుపతిలో చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్, జిల్లా స్థాయిలో క్రీడల్లో గెలుపొంది, కర్నూల్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నారు.

ఇంటింటికి ఫుట్‌బాల్ క్రీడాకారులే

సిద్ధమ్మగారిపల్లెలో మొత్తం 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి, ఇందులో ఇంటింటికి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు. 50 మందికి పైగా ఈ ఊరిలో ఫుట్‌బాల్ క్రీడాకారులున్నారు. వీరు వారంలో ఒక్కరోజు ప్రాక్టీస్ కోసం హార్సిలీహిల్స్‌కు వెళతారు. వీరు మదనపల్లె మిషన్ కాంపౌండ్, పలమనేరు, చిత్తూరు. చింతామణి, కోలారు ప్రాంతాల్లో ప్రైవేట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంటారు. 2022లో ఆరోగ్యవరంలో జరిగిన టోర్నమెంట్ స్వరాజ్ క్రీడా పోటీల్లో ఎ-జట్టు విన్నర్స్, బి.జట్టు రన్నర్స్‌గా సిద్ధమ్మగారిపల్లె క్రీడాకారులే నిలిచారు.

మూడు తరాల నుంచి...

మొదటి తరంలో జీకే వెంకటరమణ ఫుట్‌బాల్ ఆడగా ఆయన కుమారుడు కె.చెన్నకేశవులు (48) జాతీయ స్థాయిలో కేరళలోని ఆలూవాలో, 2000 సంవత్సరంలో బీటీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ కాల్ జట్టులో పుత్తూరులో నిర్వహించిన క్రీడల్లో విన్నర్‌గా నిలిచారు. మూడో తరం చెన్నకేశవులు కుమారుడు కె.నితీష్ ప్రస్తుతం జాతీయ స్థాయిలో అస్సాంలో జరిగిన ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నాడు.

గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలి

సిద్ధమ్మగారిపల్లె సమీపంలో గతంలో క్రీడా మైదానం ఉండేది. అక్కడ 6, 7 టీములతో 9 టోర్నమెంట్లు నిర్వహించారు. అది ఇప్పుడు అన్యాక్రాంతమై వైసీపీ పాలనలో వెంచర్ వేసి ప్లాట్స్‌గా మార్చేశారు. ఆరోగ్యవరంలో క్రీడా మైదానం ఉండేది. అక్కడ కూడా జాతీయ రహదారికి క్రీడామైదానం పోవడంతో ప్రాక్టీస్ కోసం ఇబ్బందులు పడుతున్నామని క్రీడాకారులు చెబుతున్నారు. కావున పల్లె వద్ద క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఇదే గ్రామంలో భద్రయ్య ఫిజికల్ డైరెక్టర్‌గా నిమ్మనపల్లెలో పనిచేస్తున్నారు. అలాగే శ్రీవేద స్కూల్‌లో పీఈటీగా మహేష్ పనిచేస్తూ ఇక్కడ యువతకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం గ్రౌండ్‌కు స్థలం కేటాయిస్తే జాతీయ స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి కూడా క్రీడాకారులను తయారు చేస్తామని కోచ్ మహేష్ చెబుతున్నారు.

చాలామందిని తయారు చేస్తా



సిద్ధమ్మగారిపల్లె నుంచే చాలామందిని క్రీడాకారులను తయారు చేస్తాను. ఇప్పటికే కోచ్‌గా వ్యవహరించడంతో యువత చాలా ఉత్సాహంగా ఉన్నారు. క్రీడల ప్రాక్టీస్ కోసం మైదానం లేక ఇబ్బందులు పడుతున్నాం. మైదానానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

-మహేష్, ఫుట్‌బాల్ కోచ్, సిద్ధమ్మగారిపల్లె

జెషోడియన్ స్ఫూర్తిగా...



చిన్నతనం నుంచి ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. మా తండ్రి వద్ద రబ్బర్‌బాల్ తెప్పించుకుని ఆడుకునేవాడిని. స్కూల్‌లో చేరిన తరువాత డాక్టర్ జెషోడియన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఫుట్‌బాల్ నేర్చుకున్నా. అప్పటిలో కళాశాల స్థాయిలో ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నా.

- జీకే వెంకటరమణ, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, సిద్ధమ్మగారిపల్లె

మూడుసార్లు హాజరు వేయాలి

- కలెక్టర్ ఆదేశాలు



కలికిరి, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ప్రతిరోజూ తప్పనిసరిగా మూడు పర్యాయాలు హాజరు నమోదు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం ఎంపీడీవోలతో జరిగిన టెలీకాన్ఫరెన్సులో ఈ మేరకు అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సచివాలయాల ఉద్యోగుల హాజరు నమోదుకు ఆయా పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని, అదేవిధంగా కార్యదర్శులు కూడా తమ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనివేళల్లో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలలోగా ఒకసారి, మధ్యాహ్నం రెండో దఫా, సాయంత్రం 5 గంటలకు మూడోసారి హాజరు వేయాలని సూచించారు. దీనిని ప్రతిరోజూ ఎంపీడీవోలు సమీక్షించాలని కూడా కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా సెలవుపై వెళ్లదలిచే సచివాలయ ఉద్యోగులు సంబంధిత కార్యదర్శి, ఎంపీడీవోకు సమాచారం అందజేసి ముందస్తు అనుమతి తీసుకోవాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారీ హాజరుపై ఉద్యోగులు నిర్లక్ష్యం పాటిస్తే కఠిన చర్యలకు గురవుతారని కూడా వివరించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవలసింది పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవోలు ఆదేశించారు.

హత్య కేసు మిస్టరీ వీడేనా?

- వివాహేతర సంబంధమే కారణమా...


ఖాదర్‌బాషా (ఫైల్)

కురబలకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట సమీపంలో యువకుడు హత్యగురైన సంఘటన కలకలం రేగింది. శుక్రవారం రాత్రి హత్యకు గురైన యువకుడి హత్య కేసు మిస్టరీ పోలీసులకు ఛాలెంజ్‌గా మరింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోటకు చెందిన వి.బాబ్జి కుమారుడు ఖాదర్‌బాషా (26) గత రెండేళ్ళ క్రితం బతుకుదెరువు నిమిత్తం కువైత్‌కు వెళ్లి తిరిగొచ్చాడు. కాగా గ్రామంలో అతను చింతపండు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిండేవాడని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇటీవల ఆ మహిళ భర్త కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఈ విషయాన్ని అతడికి కొంతమంది స్థానికులు తెలియజేయడంతో హత్యకు పథకం పన్నాడు.

దీంతో కొంతమందికి ఖాదర్‌బాషా హత్యకు డీల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న అతడికి ఫోన్ రావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లగా కొంతమంది అతడిని బలవంతంగా తీసుకెళ్లారని కుటుంబీకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద కిరాతకంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా హత్య జరిగిన సంఘటనా స్థలంలో మద్యం బాటిల్, గ్లాసులు, ఒక మహిళ చెప్పు ఉండటంతో హంతక ముఠాలో మహిళ ఎవరైనా వారికి సహకరించారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని విచారించడంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించారు. కాగా యువకుడి హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలకు గడువు పెంచాలంటూ అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు స్పందించి ముగిసిన గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించాలని తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఈనెల 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. ఈనెల 31వ తేదీ తర్వాత ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు గడువు పెంచడం జరగదన్నారు.

ఓపెన్ స్కూల్స్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశం పొందాలనుకునే వారు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రం ద్వారా గానీ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గానీ సంప్రదించి ప్రవేశం పొందవచ్చునని వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాయచోటి విద్యార్థి


వెంకటసాయి

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దివ్యతేజ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి వెంకటసాయి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న కడప పట్టణంలోని స్పోర్ట్స్ పాఠశాలలో అండర్-17 విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చి కడప జిల్లా జట్టు తరపున రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హిందూపూర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో వెంకటసాయి పాల్గొంటారని ఆయన తెలిపారు.

పసుపు రిబ్బన్లతో విధులకు...


పసుపు రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

వాల్మీకిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని వాల్మీకిపురంలో జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. శనివారం వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో కాలయాపన చేసి ఎన్నికల జీవోల పేరుతో సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్‌లు స్వప్న, కళావతి, లక్ష్మీదేవి, నందిని, ప్రసాద్‌కుమార్, జానీ, పరమేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమణ్య, నరసింహులు, రాజగోపాల్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ ఆలయ హుండీ లెక్కింపు


రెడ్డెమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

గుర్రంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ ఆలయ హుండీని దేవదాయ శాఖాధికారులు శనివారం లెక్కించారు. అమ్మవారి హుండీని ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారి హుండీ ద్వారా రూ.7,00,175 నగదు, 16 గ్రాముల బంగారం, 169 గ్రాముల వెండి వచ్చినట్లు దేవదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవో మంజుల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


21 నుంచి అమరవీరుల వారోత్సవాలు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి యేటా పోలీసు అమరులను స్మరించుకుంటూ నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఈనెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ నెల 21న అమరవీరుల స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు ఉంటాయన్నారు. 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాలను సందర్శించి పోలీసు అమరుల సేవలను వివరిస్తారన్నారు. అలాగే వారు చదివిన పాఠశాలలకు వెళ్లి అమరుల ఫొటోలు పెట్టుకునేలా సూచించడం ఆ గ్రామంలో ఏదైనా రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలా గ్రామస్తులకు సూచనలిస్తారన్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని వారికి సన్మానం, వారి సేవలను ప్రశంసించనున్నామన్నారు. 31న జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం సందర్భంగా ఉదయం యూనిటీ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగియనున్నాయని తెలియజేశారు.

సామాన్యుడి నుంచి సౌత్ కొరియా వరకు..



- దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన.. మొట్టమొదటి విదేశీ సైంటిస్ట్ రాజేశ్‌కుమార్
- యువ సైంటిస్టులకు ఆదర్శం
- ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు

బద్వేలు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణం రెడ్డయ్యమఠం వీధిలో నివసించే జ్యోతి రెడ్డప్ప, నాగరాజమ్మ దంపతులకు మొదటి సంతానం రాజేశ్‌కుమార్. ఈయనకు ఓ తమ్ముడు మహేశ్‌కుమార్, చెల్లెలు భవానీ ఉన్నారు. తమ్ముడు మహేశ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. సోదరి భవానీ గృహిణిగా స్థిరపడ్డారు.

అవరోధాలు అధిగమించి

రాజేశ్‌కుమార్ బాల్యమంతా కష్టాల కడలిలోనే సాగింది. కాన్వెంటుల్లో చేరే ఆర్థిక స్థోమత లేక పదో తరగతి వరకు బద్వేలు జడ్పీ బాయిస్ హైస్కూలులో చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ కూడా బద్వేలులోనే పూర్తి చేశారు. ఆ తరువాత పీజీ చేసేందుకు తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో చేరినప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అయ్యేవారు. కానీ ఉన్నత చదువులు చదవాలన్న సంకల్పాన్ని వీడలేదు. ఎస్వీ యూనివర్శిటీలో పీజీ పూర్తి చేసిన వెంటనే పీహెచ్‌డీ చేయాలనుకున్నారు. అందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. అయితే ఎస్వీ యూనివర్శిటీలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న వరదారెడ్డి చేయూతనందించారు. పీలేరు జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా ఉద్యోగం ఇప్పించారు. దీంతో ప్రతి రోజూ తిరుపతి నుంచి పీలేరు వెళుతూ అక్కడి కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేశారు. సాయంత్రం వేళల్లో ఎస్వీ యూనివర్శిటీలో పనిచేసే ప్రొఫెసర్ల పిల్లలకు ఇంటి వద్దకు వెళ్లి ట్యూషన్లు చెబుతూ అనేక కష్టనష్టాలు ఎదుర్కొని అనలిటికల్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఉద్యోగాల వేట


జర్మనీకి చెందిన ప్రముఖ ప్రొఫెసర్ భర్ట్‌తో చర్చిస్తున్న రాజేశ్‌కుమార్

పీహెచ్‌డీ పూర్తి చేసిన వెంటనే రాజేశ్‌కుమార్ ఉద్యోగాల వేటలో పడ్డారు. అయితే 2006లో అమెరికాలో, 2007లో జపాన్‌లో ఉద్యోగాలు పొందినా అక్కడి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఇండియాకు తిరిగి వచ్చేశారు.

దక్షిణకొరియాలో ప్రభుత్వ కొలువు

2007 చివరిలో దక్షిణ కొరియాలో కొరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో సైన్స్‌అండ్ మినరల్స్ సోర్స్‌లో ఉద్యోగాన్ని పొందారు. ఈయన జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. దక్షిణకొరియా ఏర్పడిన 90 సంవత్సరాల కాలంలో అక్కడి ప్రభుత్వంలో పర్మినెంట్ ఎంప్లాయిగా ఎంపిక చేసుకున్న మొట్టమొదటి విదేశీయుడు మన భారతీయుడైన రాజేశ్‌కుమార్.

మైలురాళ్లు..

దక్షిణ కొరియాలో పనిచేస్తూనే 14 దేశాల్లో వారి ఆహ్వానం మేరకు కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొని తన పరిశోధన పత్రాలను సమర్పించారు. 2005లో పీహెచ్‌డీ సమయంలో 2005 బెస్ట్ రీసెర్చ్ స్కాలర్ అవార్డు పొందారు. 2010లో భారతదేశానికి సంబంధించి శాస్త్ర పరిశోధన రంగంలో యువ శాస్త్రవేత్త అవార్డును డిల్లీలో అందుకున్నారు.

బ్రిటన్ దేశానికి సంబంధించి లండన్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాయల్ సొసైటీ సంస్థలో సభ్యత్వాన్ని కూడా పొందారు. ఈయనవి ఇప్పటి వరకు దాదాపు 70 వరకు పరిశోధనా పత్రాలు ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ వ్యాల్యూమ్స్‌లో ప్రచురించారు. వాటికి సంబంధించి రాజేశ్ పేటెంట్ రైట్స్ కూడా పొందారు. రాజేశ్ కుమార్ కెమిస్ట్రీపై తాను చేసిన పరిశోధన అంశాల పుస్తకాలు అమేజాన్‌లో అందుబాటులో ఉన్నాయి. యువ సైంటిస్టులకు ఇవి దిక్సూచిలా పనిచేస్తున్నాయి.



రాజేశ్‌కుమార్ సైన్స్‌పై ప్రచురించిన పుస్తకాలు

ఫ్లోరైడ్‌పై పరిశోధనలు



18 సంవత్సరాల పాటు దక్షిణ కొరియాలో సైంటిస్ట్‌గా పనిచేశాను. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని ఇండియా-ఆస్ట్రేలియా పార్టనర్‌షిప్ ప్రోగ్రాంలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నా. త్వరలోనే భారతదేశానికి వచ్చి ఫ్లోరైడ్ రహిత నీటి కోసం పరిశోధనలు జరిపి పుట్టి పెరిగిన మాతృ దేశ రుణాన్ని తీర్చుకుంటాను. నేను సాధించిన విజయాల్లో సోదరుడు మహేశ్‌కుమార్, కుటుంబ సభ్యుల సహకారం ఉంది.

- రాజేశ్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్

కొబ్బరికాయల వేలంతో రూ.80లక్షల ఆదాయం

చక్రాయపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కొబ్బరికాయలు విక్రయం వేలం నిర్వహించారు. దీంతో గండికి రూ.80లక్షల ఆదాయం వచ్చింది. శనివారం రూ.10లక్షల డిపాజిట్ కట్టి కొబ్బరికాయల వేలం నిర్వహించగా దాదాపు 10 మంది గుత్తేదారులు పాల్గొన్నారు. వేంపల్లె వాసి వెంకటరమణారెడ్డి రూ.80లక్షలకు పాట దక్కించుకున్నాడు. కొబ్బరికాయల వేలంతో వచ్చిన ఆదాయం రూ.80లక్షలకు జీఎస్టీ 18శాతం కలిపి ఒకేసారి చెల్లించాలని ఈఓ కోరారు. జీఎస్టీతో కలిపి రూ.94లక్షలు చెల్లించాల్సి ఉండగా సగం చెల్లించారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ గ్యారెంటీతో గడువు కోరారు. ఏదేమైనా రికార్డుస్థాయిలో గండికి ఆదాయం రావడం విశేషం. దేవాదాయ జిల్లా అధికారి ఇన్‌స్పెక్టర్ శివయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, భాస్కర్, సీఐ నాగరాజు, ఎస్ఐ కృష్ణయ్య, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజా ఫౌండేషన్ సందర్శించిన జడ్జి

● విద్యార్థులకు పండ్లు పంపిణీ


విద్యార్థులకు పండ్లు అందిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి మైలవరం రాజా ఫౌండేషన్ (డాడీహోం) సందర్శించారు. శనివారం ఆమె వృద్ధులు, అభాగ్యులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డాడీహోంలో పనిచేస్తున్న రాధా, కవిత సేవలను జడ్జి అభినందించారు. సేవలు చేస్తున్నవారిని, విద్యార్థులను సందర్శించి పలకరించడం చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం మైలవరం మండలం దొమ్మరనంద్యాల బీసీ హాస్టల్, మైలవరంలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. న్యాయవాదులు జంబాపురం మహేశ్వరి, జ్యోతి, పెద్దిరాజు, ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకులతో అంతర్జాతీయ ప్రాజెక్టు


ప్రాజెక్టు పత్రాలను తీసుకుంటున్న వైవీయూ అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇద్దరు ప్రొఫెసర్లకు అమెరికా వాషింగ్టన్‌లోని హెల్త్ సొసైటీ పార్టనర్ సంస్థ ప్రాజెక్టు మంజూరు చేసింది. వృక్ష శాస్త్ర ప్రొఫెసరు చంద్ర ఓబుళరెడ్డి, బయోటెక్నాలజీ ప్రొఫెసరు చంద్రశేఖర్ ప్రాజెక్టు పత్రాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి ద్వారా అందుకున్నారు. మొక్కల స్టాక్‌సీన్‌పై పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు ఇచ్చే శిక్షణ, విధివిధానాలకు వీరు రూపకల్పన చేస్తారు. శాస్త్రవేత్తలు సమగ్ర జీవభద్రత శిక్షణను అభివృద్ధి చేయడానికి వీరు కృషి చేస్తారు. అంతర్జాతీయస్థాయిలో ప్రాజెక్టు ఫలితాలు అమలు చేయనున్నారు. వైవీయూ ప్రొఫెసర్లకు అంతర్జాతీయ స్థాయి లభించడం పట్ల వైస్‌ఛాన్సలరు, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ, ప్రొఫెసరు గంగిరెడ్డి, డాక్టర్ గోవర్ధనరెడ్డి, దూర విద్య ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్


విలేజ్ క్లినిక్ పరిశీలనలో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బి.కోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మేకవారిపల్లె పీహెచ్‌సీని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్‌ఓస్టాటిస్టికల్ ఆఫీసర్ రమేశ్ రెడ్డి, డీపీఓ కుమార్‌నారాయణ, డీపీహెచ్ఎన్‌ఓ అరుణ్ కుమారి, ఏఎస్‌ఓ జాకబ్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించాలని ప్రసవానికి హాస్పిటల్‌కు తీసుకురావాలని బిడ్డకు బిడ్డకు ఎడమ ఉండాలని, రక్తహీనత తగ్గించాలని, కౌమార దశ విద్యార్థినులకు (బాలికలకు) హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించి హెచ్‌బీ తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు డబుల్‌డోస్ ఇవ్వాలని సూచించారు. వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్‌లో రాష్ట్రంలో తంగేడుపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ మొదటిస్థానంలో నిలిచిందని గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో అందించాలని హైరిస్క్ గరిణులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సీహెచ్‌ఓ నాగమణి, సీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, విజయలక్ష్మి, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఎఫ్‌హెచ్‌ఓలు, హెల్త్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నాక్‌పీర్ ఛైర్మన్‌గా ప్రొఫెసరు శ్రీనివాసులు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎకనామిక్స్ ప్రొఫెసరు శ్రీనివాసులు నేషనల్ అసెస్‌మెంటు అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ పీర్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ప్రముఖ మహాత్మా గాంధీ డిగ్రీకళాశాలను 23, 24తేదీల్లో సందర్శించనున్నారు. ఈ బృందానికి సమన్వయ కర్తగా డాక్టర్ ఎన్ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లు మెంబరు కోఆర్డినేటరు మెంబర్లుగా ఉన్నారు. ఆయన ఎంపిక పట్ల వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మార్కే కళాశాలను సందర్శించిన వీసీ


సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ అనుబంధ కళాశాలలైన భీమవరం ఎమ్మార్కే కళాశాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ శనివారం సందర్శించారు. కళాశాలలోని విద్యాప్రమాణాలు, సౌకర్యాలు పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై కళాశాల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు.

సమష్టి కృషితో కళాశాల అభివృద్ధి : ఆర్‌జేడీ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో కళాశాల అభివృద్ధికి పాటుపడాలని ఆర్‌జేడీ డాక్టర్ గిరి అన్నారు. శనివారం కడప నగరం కోటిరెడ్డి మహిళా కళాశాలను సందర్శించిన ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమై కళాశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధ్యాపకుల సామర్థ్యం మెరుగుపరచుకుంటూ నూతన పోకడలను అనుసరిస్తూ విద్యార్థులకు విద్య, ఉద్యోగపరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డేకి ఆర్‌జేడీ హాజరయ్యారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

98 పరుగులకే కుప్పకూలిన వెస్ట్ గోదావరి

6 వికెట్ల నష్టానికి 112 పరుగులతో ఈస్ట్ గోదావరి

కడప (స్పోర్ట్స్) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో శనివారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో వెస్ట్ గోదావరి జట్టు కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. మరో మ్యాచ్‌లో ఈస్ట్ గోదావరి జట్టు 6 వికెట్లు కోల్పోయి 112 పరుగులు మాత్రమే చేసింది.

● నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన వెస్ట్ గోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి 76.1 ఓవర్లలో కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. ఇందులో టి. శ్రీ సూర్యసాయిమణికంఠ (బ్యాటర్) 94 బంతుల్లో 17 పరుగులు చేయడం విశేషం.

● నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం మైదానంలో ఈస్ట్‌గోదావరి - ప్రకాశం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఈస్ట్ గోదావరి జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 41.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. ఇందులో రాజ్‌ఆర్యన్ (బ్యాటర్) 22 పరుగులు, రేవంత్ (బ్యాటర్) 32 పరుగులు చేశారు. కాగా రెండో రోజైన ఆదివారం ఆటకు చివరిరోజు.

రోడ్లు జలమయం - ప్రగతికి గ్రహణం

చినుకుపడితే రోడ్లు బురద మయం ● రూ.130 కోట్లలో సగం కూడా ఖర్చుకాని వైనం
అవస్థలుపడుతున్న జనం ● ప్రజాప్రతినిధులు హీనం


జలమయమైన మైదుకూరురోడ్డు

బద్వేలుటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బద్వేలు రోడ్లు దయనీయంగా మారాయి, వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 130 కోట్ల ప్రగతికి గ్రహణం పట్టింది. మూడు పంచాయతీలుగా ఉన్న బద్వేలు మున్సిపాలిటీగా పురోగతి చెంది 14 ఏళ్ల దాటి రెండు పాలకవర్గాలుపూర్తయి, మూడో పాలకవర్గంలో నడుస్తున్నా వార్డుల్లో రహదారులు, మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చినుకు పడితే ప్రధాన వార్డుల్లో రహదారులపై సైతం వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంటాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. నియోజకవర్గం అభివృద్ధి కోసం మంజూరైన రూ. 130 కోట్లు నిధులు ఏమయ్యాయో ఎవరికీ అంతు చిక్కడం లేదు. అధికారులను అడిగితే సగం నిధులు ఖర్చయ్యాయని చెప్పు కొస్తున్నారు. ప్రజలు మురుగు తో సావాసం చేస్తున్నట్లే వివరాల్లోకెళితే....

మురుగునీరుపారితే...

చిన్నపాటి వర్షం కురిసినా నీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహించడం సర్వసాధారణమైంది. కొన్నిచోట్ల కాల్వల్లో పూడికతీత తీయకపోవడం, మరికొన్నిచోట్ల మురుగు కాల్వలు లేకపోవడం తో వర్షంనీరు, మురుగునీరు పోయే మార్గం లేకపోయింది. దీనికితోడు మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర పదార్థాలు పేరుకుపోయాయి. బ్రహ్మంసాగర్ తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తోంది. పబ్లిక్ వాటర్, మురుగునీరు నిత్యం రోడ్లపై దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

మున్సిపాలిటీలో మొత్తం 35వార్డుల్లో 58కిలోమీటర్ల మేరకు డ్రైనేజీ కాల్వలు పూర్తిచేయాల్సి ఉండగా వాటిల్లో కొంత మేరకు అంతంత మాత్రమే పూర్తి చేశారు. రూ.130కోట్ల నిధుల్లో రూ.47కోట్లు మాత్రమే ఖర్చుచేయడంతో పట్టణ అభివృద్ధికి గ్రహణం పట్టినట్లైంది. గతంలో జనావాసాలు లేనిచోట్ల వైసీపీ నేతలు పొలాలకు, వారి స్థలాలున్నచోట్ల సీసీ రోడ్లను ఏర్పాటు చేసుకున్నారు. జనావాసాలున్నచోట్ల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో రోడ్లు, కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, మున్సిపాలిటీ పాలకవర్గం అభివృద్ధి పనులను ప్రారంభించి మురుగు కాల్వలు, రోడ్లనిర్మాణ పనులను చేపట్టి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.


రెడ్డెయ్యమఠం వీధిలో అధ్వానంగా రహదారులు


శివానగర్‌లో అధ్వానంగా సీసీరోడ్లు, మురుగు కాల్వలు

పట్టించుకున్న నాథుడేలేడు

ప్రజా సమస్యలను పాలకవర్గం, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాకాలం వచ్చిందంటే మురుగుకాల్వల్లో మురుగునీరు, వర్ష పునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దీనికితోడు ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, శివానగర్‌వాసి

పన్నులు కట్టించుకుంటారే తప్ప...

పన్నుల వసూళ్లపై పెట్టే శ్రద్ధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై పెట్టకపోతున్నారు. మురుగు కాల్వల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికల సమయంలో తప్ప సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదు.

నాగరాజు, శివానగర్‌వాసి

రూ. 10 లక్షల బకాయిలపై ఆరా

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ ● రికవరీ జరగకపోతే చట్టపర చర్యలు
స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్


ఎగువగొట్టివీడులో విచారణ చేస్తున్న అధికారులు

గాలివీడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ చేస్తున్నట్లు స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో స్త్రీనిధి బకాయిలపై విచారణ జరిపారు. మండలంలో మొత్తం రూ.10 లక్షల వరకు బకాయిలు ఉండగా అందులో అత్యధికంగా గొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో స్త్రీనిధి సొమ్ము రూ.4.15 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. ఇదే విషయమై మహిళా సంఘ సభ్యులను విచారించగా ఇప్పటికే చాలా వరకు బకాయిలు చెల్లించామని, అయినా ఎక్కువ మొత్తంలో అప్పు చూపిస్తున్నట్లు ఆరోపిస్తున్నారన్నారు. అయితే అవి బకాయిలా లేక వెలుగు సిబ్బంది చేతివాటంతో నిలిచిపోయిన అప్పా అనే విషయం క్షేత్రస్థాయిలో రసీదులు, బుక్కులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. మండలంలో గుండ్లచెరువు రూ.80,900, నీసీ పల్లె రూ.65 వేలు, తూముకుంట రూ.29,500, అరవీడు రూ.32,000 బకాయిలు ఉన్నాయన్నారు. శనివారం జరిగిన విచారణలో రూ.1,20,000 రికవరీ కాగా అందులో గుండ్ల చెరువు నుంచి రూ.30 వేలు, నూలివీడు రూ.75 వేలు, పూలుకుంట రూ.15 వేలు ఉన్నట్లుగా తెలిపారు. విచారణ అధికారులు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి స్వాహా అయిన స్త్రీనిధి సొమ్మును రికవరీ చేసి, కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ మౌనిక, లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం పెద్దరెడ్డెయ్య, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామాపురం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో చికిత్స పొందుతూ షేక్. తహరిన్ (70) శనివారం మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం మండల హసనాపురం పంచాయతీ కస్పాకు చెందిన షేక్. తహరీన్ సెప్టెంబరు 17న గ్రామం చివర్లోని గేదెలు తోలుకుని వెళ్లింది. అక్కడ ఆమెను పాముకాటు వేయడంతో తన కుటుంబీకులు చికిత్స కోసం రాయచోటి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగుళూరు విక్టోరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

● రూ.6 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం : డీఎస్పీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా దొంగలను అరెస్టు చేసి ఆరు లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలి వాసి నడింపల్లి గోపీ, నెల్లూరు పట్టణం గుడిపిల్లపాడు ప్రాంతం లక్ష్మీగణపతి వీధికి చెందిన లింగుబెరి రాంబాబు జూన్ 30న పట్టణంలోని లక్ష్మీపురంలో రెండు ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీపై కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం వారిని అరెస్టు చేసి, రూ.6 లక్షల విలువైన 86.500 గ్రాములు బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కనిగిరి, వేదాయపాలెం, యలమంచిలి, నెల్లూరు, పత్తిపాడు, సింగరాయకొండ, జలదంకి, పొదలి, కావలి, చిలకపూడి, పామూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదైనట్లు వివరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, పోలీసు సిబ్బంది రామచంద్ర, బరకతుల్లా, మహేంద్రనాయుడు, పెంచలయ్య, మహేంద్ర, టెక్నికల్ అనాలసిస్ వింగ్ కానిస్టేబుల్ రవి తదితర సిబ్బందిని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం


విరాళం అందిస్తున్న శ్రీనివాసులు

చక్రాయపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం వేంపల్లె వాసి చెల్లుబోయిన శ్రీనివాసులు, ధర్మపత్ని మల్లమ్మ రూ.1,00,516 విరాళంగా ఇచ్చారు. టెంకాయలు విక్రయించే దుకాణంలో పనిచేసే వ్యక్తి విరాళమివ్వడం అభినందనీయమని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్నారు. మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలు, మెమెంటో అందించారు. ఇలాంటి దాతలు ముందుకురావాలని ఏసీ కోరారు.

వ్యక్తి ఆత్మహత్య - కేసు నమోదు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి భూమిరెడ్డి నాగిరెడ్డి (30) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె వాసి భూమిరెడ్డి సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి పంట సాగు చేసేవాడు. ఇటీవల పెట్టిన పంటకు కనీస మద్దతు ధర రాకపోవడంతో అప్పులు ఎక్కువై మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం విషద్రావణం తాగాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

24న అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్‌పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు 24న బద్వేలు బిజివేముల వీరారెడ్డి కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బోర్డు సెక్రటరీ రావసుబ్బారెడ్డి తెలిపారు. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబల్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టరు సంతకం చేసిన ఎలిజబులిటీ ఫాం, కళాశాల ఒరిజినల్ సర్టిఫికెట్‌పై ఫొటోపై అటెస్టేషన్ చేయించాలన్నారు. టెన్త్, ఇంటర్ మార్కులజాబితా ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని, క్రీడాకారులు జూలై 1, 2024 నాటికి 17 నుంచి 25 ఏళ్ల వయసు ఉండాలన్నారు. 9000294626, 9705459052 సంప్రదించాలన్నారు.

చోరీ వస్తువుల రికవరీ

చెన్నూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్తరోడ్డులోని ఓ మెడికల్ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. కడప నగర వాసులు సయ్యద్ మహ్మద్ యూసఫ్, షేక్ ఫర్హాణ్ మూడురోజుల కిందట మెడికల్ షాపులో రెండు సెల్‌ఫోన్లు, ఒక వాచ్ రూ.2500 రికవరీ చేశారు. దీంతో షాపు యజమాని దొంగతనంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సీఐ చోరీకి గురైన వస్తువులు రికవరీచేసి, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రామాపురం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కుమ్మరపల్లి పంచాయతీ కస్పాకు చెందిన తుపాకుల గోవిందరాజు (21) శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... కుమ్మరపల్లి వద్ద పద్మావతి కోళ్ల పెంపకంలో పనిచేస్తున్న గోవిందరాజు శుక్రవారం పొద్దుపోయాక మద్యం తాగి భార్య వల్లెమ్మతో గొడవ పెట్టుకుని పురుగుల మందు తాగాడు. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ చైర్మన్ ఎవరికో..?

●రెడ్డెమ్మకొండ ఆలయ చైర్మన్ పదవి కోసం వర్గపోరు ●నెలలు గడుస్తున్న పట్టించుకోని నాయకులు ● కుంటుపడుతున్న ఆలయ అభివృద్ధి

గుర్రంకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయం చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో ఇంకా అర్థంకాని పరిస్థితి. ఆలయ చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో ఆలయంలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. రెడ్డెమ్మకొండ ఆలయం అభివృద్ధి పథంలో నడవ నుంది. అమ్మవారి ఆలయాన్ని రూ.1.40 కోట్లతో అత్యంత వైభవంగా రాతితో పునర్నిర్మించారు. అలాగే కోనేరును రూ.25 లక్షలతో ఆధునీకీకరించారు. అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఆలయం ప్రారంభోత్స వానికి సిద్ధమైంది. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత పాలక వర్గం పూర్తిగా రద్దుఅయింది. దీంతో రెడ్డెమ్మకొండ దేవస్థానం చైర్మన్ కోసం ఎదురుచూస్తోంది. గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు అనగానే గుర్తొచ్చేది సంతాలక్ష్మి అమ్మవారు. ఈ ఆలయానికి సంతానం లేని వారు వచ్చి అమ్మవారి వద్ద వరపడితే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో సంతానం కోసం ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయానికి వేలాది మంది దంపతులు వచ్చి దర్శించుకుంటారు. భక్తుల రాకతో ఆలయానికి ఆదాయం కూడా బాగానే ఉం టుంది. ఇలాంటి ఆలయానికి చైర్మన్ లేకపోవడంతో అభివృద్ధి అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదని పలువురు వాపోతున్నారు. కాగా చైర్మన్ పదవి కోసం టీడీపీలో వర్గ పోటీ జరుగుతోంది. చైర్మన్ పదవిని ఏ వర్గానికి కేటాయించాలో తెలియక నాయకులు సతమతమవుతున్నారు.



ఓ వర్గానికి ఇస్తే...మరో వర్గం దూరం..?

గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ టీడీపీ కంచుకోట. ఇక్కడ ప్రతి ఎన్నికల్లో టీడీపీకే బలమైన మెజారిటీ వస్తుంది. ఈ నేపథ్యంలో దశాబ్దకాలంగా టీడీపీలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఈ రెండు వర్గాల్లోని ముఖ్య నాయకులు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి కావాలంటూ అధిష్టానం చుట్టూ తిరుగుతున్నారు. పార్టీ అధిష్టానం మాత్రం రెండు వర్గాలు కలిసి చైర్మన్ పదవికి ఓ పేరును ప్రతిపాదించాలని సూచించింది. ఈ క్రమంలో నాయకులు కలవలేక తమ ప్రయత్నాలు తాము చేస్తూ పంతం నెగ్గించుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఓ వర్గానికి పదవి ఇస్తే మరో వర్గం ఎక్కడ దూరమవుతుందోనని నాయకులు సంకటపడతున్నారు.

చైర్మన్ పదవికి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది

రెడ్డెమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ పదవి కోసం దేవదాయశాఖ నుంచి నోటిఫికేషన్ రావాల్సిఉంది. ప్రభుత్వం మారడంతో పాత బోర్డు రద్దు అయింది. దేవదాయశాఖ నుంచి చైర్మన్ పదవికి నోటిఫికేషన్ రాగానే కొత్త బోర్డు ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించి చైర్మన్‌ను నియమిస్తాం. కార్తీకమాసంలో అమ్మవారి ఆలయాన్ని ప్రారంభించాలని దేవదాయశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

-మంజుల, ఈవో, రెడ్డెమ్మ తల్లి ఆలయం, గుర్రంకొండ మండలం

చింతపర్తి ఆస్పత్రి తనిఖీ



చింతపర్తి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

వాల్మీకిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాలు ఆగిన తర్వాత అంటువ్యాధులు ప్రబలే అకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పాము, కుక్క కాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీవిద్య సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ



మదనపల్లె పట్టణంలో మొక్కలు నాటి నీళ్లుపోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శేషమహల్ ప్రాంతంలో మున్సిపాలిటి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె పట్టణాన్ని గ్రీన్ సిటీగా మార్చడానికి ఐదేళ్లలో 50వేల మొక్కలను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలు కూడా వారి ఇళ్ల ఎదుట నాటిన మొక్కలను పరిరక్షించి, చెట్లుగా ఎదిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, టీడీపీ నాయకులు కేహెచ్ ప్రశాంత్, తాళ్ల హిమగిరి, నాగమణి, బెల్లె రెడ్డిప్రసాద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాలమ్మ జాతర

కలికిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తేగడ పంచాయతీలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు అంకాలమ్మ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయాత్పూర్వం నుంచి అభిషేకాలు, అర్చనలు పూర్తయిన అనంతరం అమ్మవారికి కుంభాభిషేకం ఆ తరువాత ప్రత్యేక అలంకరణలతో రాత్రి దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రికి చాందినీ బండ్లు, కోలాటాలతో జాతర జరుగుతుందని తెలిపారు.

‘పల్లె పండుగ’తో గ్రామాల అభివృద్ధి

రామసముద్రం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నాయని ప్రజాప్రతినిధు లు, అధికారులు పేర్కొన్నారు. రామసము ద్రం మండలంలోని 19పంచాయతీలలో 47చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ నియోజకవర్గ స్థాయిలో రూ.10కోట్లు సీసీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా అందులో మొదటి విడతగా రామసముద్రం మండలానికి రూ.3కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజి, మండల మాలమహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప, మాజీ జడ్పీటీసీ శివశంకర్, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, జావీద్, రమేష్ పాల్గొన్నారు.

పీలేరులో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘పల్లె పండుగ’ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసిందని కేవీపల్లె ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శనివారం భూమిపూజ చేశారు. పీలేరు, కేవీపల్లె మండలాల టీడీపీ అధ్యక్షులు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, గీతాంజలి, నాయకులు సంఘం శివారెడ్డి, శంకర్ రెడ్డి, నాగిరెడ్డి, ఆర్‌బీఐ రమణారెడ్డి, రాజా, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి పరుగు



బాటవారిపల్లె బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

కలకడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భా గంగా శనివారం సీసీ రోడ్లకు అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. మం డలంలోని ఎర్రకోటపల్లె, రాతిగుంటపల్లె, కోన, బాటవారిపల్లెల్లో కార్యక్రమం జరిగిం ది. ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో చెన్నకేశవులు, సర్పంచ్ నాగరత్న, నాయకులు పీవీ రమణనాయుడు, దమోదర్‌నాయుడు, తారకే శ్వర, వేణుగోపాల్‌నాయుడు, వెంకటేశ్వరరావు, వసంతనాయుడు, శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్ వెంటనే పూర్తి చేయండి

బి.కొత్తకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని హంద్రీ-నీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, రీవెరిఫికేషన్ పరిశీలకులు రాఘవేంద్ర రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శనివారం బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని అన్నారు. బదిలీలు అయిన వారు వారి పంచాయతీ పరిధిలోని భూముల రీవెరిఫికేషన్ పూర్తి చేశాకనే రిలీవ్ అవుతారన్నారు. అక్రమాలు జరిగివుంటే ఫ్రీహోల్డ్ ఆధారంగా రిజిస్టర్ అయిన భూములపై సైతం తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జి తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు స్థల పరిశీలన

బి.కొత్తకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు సురక్షితమైన ప్రదేశం కోసం శనివారం అధికారులు స్థలపరిశీలన చేశారు. ఇన్‌చార్జి తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ, సీఐ రాజారెడ్డిలు పట్టణంలోని పీటీయం రోడ్డులో ఓ ప్రైవేటు స్థలాన్ని ఎంపిక చేశారు. అదేవిధంగా కనికలతోపు, కాండ్లమడుగు క్రాస్‌లలో సైతం టపాసుల దుకాణాల కోసం స్థలపరిశీలన చేశారు. నిబంధనలను అనుసరించి దుకాణాలను నిర్వహించుకోవాలని సీఐ హెచ్చరించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 19:(ఆంధ్రజ్యోతి)ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తు గడువు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఎం. సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పఠాన్ మహమ్మద్ ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో చదువు మానేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక జడ్పీహైస్కూల్ లో పది, ఇంటర్‌కు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు మరెన్ని వివరాలకు 8121852786 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు తమను క్రమబద్ధీకరణ చేయాలని నిరసన తెలిపారు. శనివారం మధ్యాన్న భోజన విరామ సమయంలో వారు పసుపు రంగు బ్యాడ్జీను ధరించి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటికే కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించారని ఏపీలో కూడా అదే తరహాలో క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగే శ్వర్వరావు, క్రిష్ణమూర్తి, హరినాయక్, రాజా, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలుతో విద్యార్థుల అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి, కూటమి నేతలు

తంబళ్లపల్లె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్ర మాదంలో మృతి చెందిన విద్యార్థులు చెట్లవారిపల్లెకు చెందిన యశ్వంత్ కుమార్‌రెడ్డి(20), మలిగివారిపల్లెకు చెందిన అజయ్‌కువమార్‌రెడ్డి (20)ల అంత్యక్రియలు శనివారం అశ్రునయనాల మధ్య ముగిసాయి. పోస్టుమార్టం అనంతరం మదనపల్లె జిల్లా వైద్యశాల నుంచి స్వగ్రామానికి చేరుకున్న విద్యార్థుల పార్థివ దేహాలను చూసి కుటుంబీకులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మేం ఏం పాపం చేశాం దేవుడా..ఇంత చిన్న వయసులోనే నా బిడ్డను దూరం చేశావని.. బిడ్డల మృతదేహాలపై పడి తల్లితండ్రులు రోదించిన తీరు చూపరుల్ని కంటతడి పెట్టించింది. దీంతో చెట్లవారిపల్లె, మలిగివారిపల్లె గ్రామాల్లో విషాదచాయలు అలముకున్నాయి. చిరుజల్లులు కురుస్తున్నా చివరి చూపు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, స్నేహితులు, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి, సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, కూటమి నేతలు, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు మృతుల భౌతికకాయాల్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుల తల్లితండ్రులు, కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

మృతుల కుటుంబాలకు మల్లికార్జుననాయుడు పరామర్శ



విద్యార్థి తండ్రిని ఓదార్చుతున్న సీడ్ మల్లికార్జుననాయుడు

మదనపల్లె, అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను శనివారం టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననా యుడు పరామర్శించారు. కురబలకోట మండలం దాదంవారిపల్లె వద్ద జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో మృతి చెందిన చెట్లవారిపల్లెకు చెందిన యశ్వంత్‌కుమార్‌రెడ్డి, మలిగివారిపల్లెకు చెందిన అజయ్‌కుమార్‌రెడ్డిల స్వగ్రామాలకు వెళ్లి భౌతికకాయాల్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుల తల్లితండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

కూలిన పాఠశాల భవనం గోడ

బి.కొత్తకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లెలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం లోపలివైపున ఓపక్క గోడ శుక్రవారం రాత్రి కూలిపోయింది. భవనం పాతబడిపోవడంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ వైపు నున్న గోడ కూలి పోయింది. దసరాశెలవులు ముగిసినా తుఫాను కారణంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాఠశాలలకు శెలవు ప్రకటించడంతో ఈ భవనంలో విద్యార్థులు ఎవరూ లేక పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలియడంతో నియోజకవర్గ టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి కూలిన భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆలేటిపల్లెలో ఒకటినుంచి ఐదవ తరగతి వరకు ఒకే భవనం ఉండటం, అదికూడా శిధిలావస్థలో వుండి ఇలా కూలిపోవడం బాధాకరమన్నారు. నూతనభవన నిర్మాణం చేయిస్తామని గ్రామస్థులకు హామీనిచ్చారు. ఆయన వెంట డీటీ మహమ్మద్ అన్సారీ, ఎంపీడీవో శంకరయ్య, ఎంఈవో భీమేశ్వరాచారి, లోకనాథరెడ్డి, శివరాంరెడ్డి, గంజిమోహన, ఓబులేసు, రామచంద్ర తదితరులున్నారు.

కాలనీకి రోడ్డు వసతి కల్పించండి

తంబళ్లపల్లె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన టీఎన్ జయసూర్యరెడ్డి కాలనీకి రోడ్డు, తాగు నీరు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో ఉపేంద్రరెడ్డికు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తంబళ్లపల్లె టీఎన్ జయసూర్యరెడ్డి కాలనీలో కొంత మంది నివాసం ఉండగా, పలువురు ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. క్రాస్‌లో ఉన్న ఎంపీడీవో, వెలుగు, ఉపాధి, కార్యాలయంతో పాటు, ఎస్బీఐ బ్యాంకుకు తమ కాలనీ మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. కార్యక్రమంలో రెడ్డప్పరెడ్డి, మస్తాన్, నారాయణరెడ్డి, మంజునాథరెడ్డి, ఈశ్వరప్ప, శంకర, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దిక్సూచి పుస్తకం కరదీపికలా ఉంటుంది

మదనపల్లె టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) దిక్సూచి పుస్తకం ఉపాధ్యాయులకు కరదీపికల ఉపయోగపడుతుందని డీవైఈవో శ్రీరామ పురుషోత్తం పేర్కొన్నారు. శనివారం స్థానిక డీవైఈవో కార్యాలయంలో ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరంచే రూపొందించిన దిక్సూచి పుస్తకాన్ని డీవైఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను మంచి మార్కులు వచ్చేలా దిక్సూచి పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్సు టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.భాస్కరన్, ప్రధాన కార్యదర్శి జగన్‌రెడ్డి, కోశాధికారి పి.ఎల్.ఎన్.శాస్త్రి, గౌరవ సలహాదారుడు కె.భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

పెద్దమండ్యం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దమండ్యం, వెలిగల్లు పశు వైద్యాధికారులు ఉస్మాన్, విక్రమ్ రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని వెలిగల్లు లో శనివారం గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు జరిగే పశు వైద్య శిబిరాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. వాటివల్ల బడి గొర్రెలు వ్యాధి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. జీవాల్లో పునరుత్పత్తి సామర్థ్యం, పిల్ల జీవాల్లో వేగంగా పెరుగుదల, అధిక బరువుకు వస్తాయన్నారు. పశు వైద్య సహాయకులు, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



గురుకుల పాఠశాలలో స్టోర్‌రూమ్ తనిఖీ చేస్తున్న 2వ అదనపు జిల్లా జడ్జి అబ్రహాం

మదనపల్లె టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే బాలికా, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా 2వ అదనపు జడ్జి బి.అబ్రహాం పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను జడ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని డార్మెంటరి, డైనింగ్ హాల్, వంట గది, స్టోర్ రూమ్‌ను జడ్జి పరిశీలించి అక్కడ విద్యార్థినులకు ఏవైనా అసౌకర్యాలు ఉంటే తెలపాలని సూచించారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులను విచారించారు. ఈ పాఠశాల ఎగువన ఉన్న గుట్టలపై నుంచి వర్షపు నీరంతా పాఠశాల ప్రహరీ కింద ప్రవహిస్తూ, పాఠశాల ఆవరణలో కాలువలు ఏర్పడి ఇబ్బందిగా ఉందని అధ్యాపకులు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. ప్రిన్సిపాల్ వసుంధర, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మోడల్ స్కూల్ హాస్టల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న న్యాయాధికారి

తంబళ్లపల్లె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ సూచించారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను న్యాయాధికారి ఆకస్మికంగా తనిఖీ చేసి హాస్టల్ భవనం, గదులు, వంట సరుకుల నాణ్యత, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థినుల సమస్యలతో పాటు అందుతున్న మౌలిక సౌకర్యాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో పోలీసులు హాస్టల్ వైపు నైట్ బీట్ తిరిగేలా చూడాలని హాస్టల్ సిబ్బంది న్యాయాధికారిని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



న్యాయవాదులతో మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేశ్

పీలేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేశ్, పోలీసు అధికారులు, న్యాయవాదులకు సూచించారు. డిసెంబరు 14న జరిగే లోక్ అదాలత్ సన్నాహక కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన తన కార్యాలయంలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, మెయింటెనెన్స్, ఎన్ఐ యాక్టు, మోటరు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమలు వంటి కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే దిశగా కక్షిదారులకు ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలని జడ్జి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.రవి, పీలేరు బార్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, పీలేరు, కేవీపల్లె, రొంపిచెర్ల, భాకరాపేట, ఎర్రావారిపాళెం, సదుం ఎస్ఐలు, పీలేరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమరవాణాను అరికట్టాలి

● వాక్ ఫర్ ఫ్రీడమ్‌లో జడ్జి వెంకటేశ్వరనాయక్



జడ్పీహైస్కూల్ నుంచి వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జడ్జి వెంకటేశ్వర్లు

మదనపల్లె టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ పేర్కొన్నారు. శనివారం గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీహైస్కూల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని జడ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎవరైనా మహిళలు, చిన్నారులు అక్రమ రవాణాకు గురైతే 1098, 181, 100 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. సుభద్ర మాట్లాడుతూ ఆస్ట్రేలియా ది మూవ్‌మెంట్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా 95 దేశాల్లో 110 చోట్ల వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీలు నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా మదనపల్లెలో కూడా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, మౌలానా అంజాద్‌ఖాన్, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు జి.సుబ్రమణ్యం, ఎ.కవితారాణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



వాల్మీకిపురం కోర్టులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో జడ్జి గురుఅరవింద్

వాల్మీకిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. శనివారం మండల న్యా యసేవాధికార సంస్థ ఆ. ధ్వర్యంలో కోర్టు ఆవరణ లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈసం దర్భంగా కోర్టు ఆవరణలో పిచ్చిమొ క్కలు తొలగించి, పారిశుధ్య కార్యక్ర మా లు చేపట్టారు. కార్యక్రమాలలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం ద్‌కు మార్, న్యాయవాదులు, మండల న్యాయసేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

కాపు, బలిజలకు యాప్ ద్వారా వినూత్న సేవలు



ప్రెస్‌క్లబ్‌లోవిలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌తేజ్ తదితరులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కాపు, బలిజలకు వినూత్నంగా యాప్ ద్వారా విద్యా, ఉద్యోగ, వైద్యం తదితర అంశాలపై సేవలను అం దిస్తున్నట్లు స్థానిక శ్రీకృష్ణ దేవరాయల కాపు సేవాలయ సొసైటీ చైర్మన్, ఫౌండర్ టీఎస్ నరసయ్య, టి.పవన్‌తేజా పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల్లో విద్య, ఉద్యోగ, వైద్య సేవలను కాపు, బలిజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాపు బలిజ సంఘం నాయకులు ఆంజనేయులు, రేగడప్రసాద్ కుమార్, శివరాం, వాణి, స్వరూప చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

పేదలకు, యాచకులకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మదనపల్లె లయన్స్ అభయ సభ్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిద్రిస్తున్న పేదలకు, యాచకులకు, వృద్ధులకు శనివారం మదనపల్లె లయన్స్ అభయ మదనపల్లె అధ్యక్షుడు కె. సుధాకర్‌రెడ్డి, దేశాయ్ జయదేవరెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మదనపల్లె లయన్స్ అభయా సేవా ద్వారా భవిష్యత్‌లో మరెన్నో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ అభయ సభ్యులు దండు శేఖర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, గిరిధరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు.